రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0 (బుధవారం)
కనిష్ఠం : 27.0



పత్తి దుర్గాస్వామి ఈశ్వర శేషారావు

మేమెలా బతికేది.. దేవుడా!

సింహాచలం ఘటనలో ఇద్దరు కోనసీమ వాసుల మృతి

- రెండు కుటుంబాల్లో విషాదం
- కన్నీరుమున్నీరైన కుటుంబీకులు
- మాచవరంలో విషాదఛాయలు
- అండగా జనసేన : పవన్

అంబాజీపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎంత పనిచేశావ్ దేవుడా.. నిన్నుచూద్దామని వస్తే..నీ దగ్గరకే తీసుకుపోయావా..ఎలా బతికేది అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. నాన్నా లేవరా ఇంటికెళ్లిపోదాం.. తమ్ముడూ లేవరా అంటూ ఇద్దరి మృతదేహాలను పట్టుకుని విశాఖ కేజీహెచ్ వద్ద రోదిస్తున్న తీరు చూపరులను కంటతడిపెట్టించింది.. విశాఖ కేజీహెచ్ ప్రాంగణం బంధువుల రోధనలతో నిండిపోయింది. విశాఖ జిల్లా సింహాచలం సింహాద్రి అప్పన్న ఆలయం వద్ద గోడకూలిన దుర్ఘటనలో ఎనిమిది మంది మృతిచెందగా.. ఇద్దరు కోనసీమ జిల్లాకు చెందిన వారు ఉన్నారు. బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన పత్తి దత్తుడు- వెంకటరమణ దంపతుల రెండో కుమారుడు పత్తి దుర్గాస్వామినాయుడు(28) వైజాగ్‌లో డైమండ్ ఇంటీరియర్స్ వర్క్ చేస్తున్నాడు.అదే గ్రామానికి చెందిన కుంపట్ల శ్రీనివాసరావు-సీతామహాలక్ష్మి దంపతుల ప్రథమ కుమారుడు మణికంఠ ఈశ్వరశేషారావు(శివ)(29) వైజాగ్‌లోని మెట్రో కంపెనీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరిద్దరిదీ ఒకే ఊరు.. స్నేహితులు కావడంతో ఎక్కడకు వెళ్లినా ఇద్దరూ కలిసే వెళతారు. మంగళవారం మధ్యాహ్నం ఇద్దరూ కలిసి అప్పన్న చందనోత్సవానికి వెళ్లారు.సింహాచలం ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండ డంతో ప్రమాదవశాత్తూ ప్రహరీ కూలిన ఘటనలో ఈ ఇద్దరూ మృతిచెందారు. ఈ వార్త టీవీలోను, సామాజిక మధ్యమాల్లోను రావడంతో కుటుంబీకులు చూసి షాక్‌కు గురయ్యారు.చేతికంది వచ్చిన కొడుకుల మృతివార్త తెలుసుకుని విషాదంలో మునిగిపోయారు. వెంటనే సింహాచలం బయలుదేరి వెళ్లారు. అనుకోని ఘటనతో ఇద్దరు యువకులు మృత్యువాత పడడంతో ఆ రెండు కుటుంబాలు కన్నీటిపర్యంతమయ్యారు.అందివచ్చిన కొడుకులు ఇకలేరని.. తిరిగిరారని తలచుకుంటూ రోధిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. మృతులకు కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. బాధిత కుటుంబీకులను మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు,గణబాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు. ఓదార్చారు.

దైవ భక్తే..దూరం చేసింది..



'నా బిడ్డకు దైవభక్తి ఎక్కువ. తరచూ ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుంటుంటాడు. వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ప్రతి వారం వచ్చేవాడు.. అంబాజీపేట వచ్చి అందరినీ పలికరించి వెళ్లేవాడు.. ఇప్పుడు ఆ భక్తే అతడిని మా నుంచి దూరం చేసింది' ఇంటీరియర్ డెకరేషన్‌లో ఎంతో పేరు తెచ్చుకున్నాడు. మా కుటుంబానికి చేదోడు..వాదోడుగా ఉంటున్నాడు అంటూ పత్తి దుర్గా స్వామినాయుడు తండ్రి వీర వెంకట సత్యనారాయణ విలపించారు.

పత్తి వీర వెంకట సత్యనారాయణ (దుర్గాస్వామినాయుడు తండ్రి)

ఎలా వెళ్లిపోయావురా?



మమ్మల్ని విడిచి ఎలా వెళ్లిపోయావు రా తమ్ముడు.నువ్వు ఇక లేడంటే అమ్మ, నాన్న నమ్మడం లేదు..ఏం చేయమంటావు రా అంటూ శేషారావు సోదరుడు లక్ష్మీనారాయణ కన్నీటి పర్యంతమయ్యాడు. కుటుంబమంటే తమ్ముడికి ఎంతో ఇష్టం..ఏడాదికాలంగా వైజాగ్ మెట్రో కంపెనీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆస రాగా ఉంటున్నాడు. నాన్నకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. వాడే మా కుటుంబానికి అండ..

- శేషారావు సోదరుడు లక్ష్మీనారాయణ

జనసైనికుల మృతి బాధాకరం

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

జనసైనికులు పత్తి దుర్గాస్వామినాయుడు, కుంపట్ల మణికంఠ ఈశ్వరశేషారావు మృతి బాధాకరమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని,జనసేన పార్టీ తరఫున ఎంతో అభిమానంగా పనిచేశారన్నారు. మృతుల కుటుంబాలకు జనసేన అండగా నిలుస్తుందన్నారు.



పది పూర్తయ్యింది.. తరువాత ఏం చదివించాలన్నదే తల్లిదండ్రులకు పెద్ద టాస్క్.. దీనిలో భాగంగా బుధవారం ఉదయం నిర్వహించిన పాలిటెక్నిక్ పరీక్షకు వేలాదిగా విద్యార్థులు హాజరయ్యారు. -తిలో



మంత్రి దుర్గేష్‌కు సీఎంవో కార్యాలయ ఆదేశాల ప్రతులు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

మంత్రి దుర్గేష్‌కు సీఎం అభినందన

నిడదవోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) :వియత్నాంలో జరిగే బుద్ధ భగవానుడి అవశేషాల ప్రదర్శన కార్యక్రమ నిర్వ హణ బాధ్యతను కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజ్జు,రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్‌లకు అప్పగిస్తూ పీఎంవో కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం సీఎం నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో మంత్రి దుర్గేష్‌ను అభినందించారు. వియత్నాంలో జరిగే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి దేశానికి,రాష్ట్రానికి పేరు తీసుకురావా లంటూ సూచించారని మంత్రి కందుల దుర్గేష్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఈ మేరకు రాజమహేంద్ర వరంలోని మధురపూడి ఎయిర్‌పోర్టు నుంచి బుధ వారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.అక్కడ నుంచి వియత్నాం వెళ్లనున్నారు. గురువారం నుంచి మే 6వ తేదీ వరకు జరిగే బుద్ధ భగవానుడి అవశేష ప్రదర్శన కార్యక్రమ నిర్వహణ చేయనున్నారు. మంత్రి దుర్గేష్ కు మధురపూడి విమానాశ్రయంలో జనసైనికులు ఘనంగా వీడ్కోలు పలికారు.



ఆరు!

సీఎం చంద్రబాబు కలలకు రూపం వచ్చింది.. ప్రతి అసెంబ్లీలో ఒక పారిశ్రామికవాడ ఉండాలన్న ఆయన ఆలోచలకు నేడు తొలి బీజం పడనుంది..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల్లో పిఠాపురం,జగ్గంపేట, రామచంద్రపురం, రాజమహేంద్రవరంరూరల్, కాకినాడరూరల్, పెద్దాపురంతొలి విడతగా పారిశ్రామిక పార్కులను తీర్చిదిద్దను న్నారు..ఈ మేరకు గురువారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు..



ఏపీఐఐసీ కార్యాలయం

ఆరు నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు

- ఉమ్మడి జిల్లాలో మరో అడుగు
- తొలి విడతగా ఆరు చోట్ల నిర్మాణం
- భూములకు ఏపీఐఐసీ ఆపసోపాలు
- అరకొరగా ప్రభుత్వ భూములు
- అయినా వీటివైపే మొగ్గు
- నేడు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పరుగులు తీయించడం కోసం ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాలకు భూముల లభ్యత తలనొప్పిగా మారింది. ఒక్కో నియోజకవర్గంలో వందెకరాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రయత్నిస్తుంటే ఎక్కడా ఏపీఐఐసీకి భూములే దొరకడం లేదు. రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపినా ఎక్కడా జాగా కనిపించడం లేదు. దీంతో అరకొరగానే ఉన్న స్థలాల్లో ఏదోలా పరిశ్రమలను ప్రోత్సహించ డానికి నానాతంటాలు పడుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆశించిన స్థాయిలో భూముల్లేని పరిస్థితి. ఉన్నంత వరకు భూములు చేతికి వచ్చిన ఆరు నియోజకవర్గాల్లో తొలి విడత పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు నిర్ణయిం చింది. సీఎం చంద్రబాబు నేడు(గురువారం) వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఐదు నియోజకవర్గాల్లో ప్రభుత్వం ప్లగ్‌అండ్‌ప్లే విధానంలో రూ.9.20 కోట్లతో భవనాలు నిర్మించి చిన్న కంపెనీలకు అద్దెకు ఇవ్వనుంది.

చంద్రన్న ఆదేశంతో కదలిక..

రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగం పూర్తిగా పడకేసింది. అప్పటి అధికార నేతల బెదిరింపులు, భూదాహంతో ఉన్న కంపెనీలు, రావాల్సిన కంపెనీలు రాకుండా పోయాయి. దీంతో యువతకు ఉద్యోగాలు లభించని పరిస్థితి. ఇదిలా ఉండగా ప్రభుత్వం మారాక సీఎం చంద్రబాబు పారిశ్రామిక రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గాల్లో సైతం చిన్నమధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భూముల లభ్యత బట్టి పది ఎకరాల నుంచి వంద ఎకరాల వరకు సిద్ధం చేయాలని ఏపీఐఐసీని ఆదేశించారు. వీటిలో ప్రభుత్వం ప్లాట్లు వేసి కంపెనీలకు కేటాయించడం, మరికొన్నింటిలో ప్రభుత్వమే భవనాలు నిర్మించి కంపెనీలకు ఇవ్వాలని నిర్ణయించారు.

ఆరు నెలలుగా భూజల్లెడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏపీఐఐసీ అధికా రులు గడచిన ఆరునెలలుగా నియోజకవర్గాల్లో భూములను గుర్తించే పనిలో పడ్డారు. రెవెన్యూ అధికారులను సంప్రదించి ప్రభుత్వ భూములు ఇవ్వాలని కోరారు. కానీ ఎక్కడ చూసినా పెద్దగా ప్రభుత్వ భూములు లేని పరిస్థితి.అక్కడక్కడా ఉన్నా ఎకరం,రెండెకరాలకు మించి లేవు. దీంతో ఏంచేయాలో ఏపీఐఐసీకి తోచని పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ ప్రభుత్వ భూముల కబ్జా, కొన్ని చోట్ల పూర్తిగా జగనన్న కాలనీలకు లాగేసుకోవడంతో ఎక్కడా భూములు లేవు. దీంతో ఏం చేయాలో తెలియక ఉన్న అరకొర భూములనే ఇవ్వాలని ఏపీఐఐసీ రెవె న్యూ అధికారులను కోరింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మొత్తం పారిశ్రామిక పార్కులకు 404 ఎకరాలే ఉన్నట్టు తేలింది. దీంతో ఏపీఐఐసీ తలపట్టుకుంటోంది. ఇంత తక్కువ భూమిలో పారిశ్రామికపార్కుల ఏర్పాటు ఎలాగో అర్థంకాక గింజుకుంటోంది. పోనీ ప్రైవేటుగా సేకరించాలంటే వందల కోట్ల లో ఖర్చు కానుంది. దీంతో పారిశ్రామిక పార్కు ల ఏర్పాటు కష్టతరంగా మారిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది.

తొలుత ఆరు చోట్లే...

కావాల్సినంత భూముల లభ్యత లేకపోవడం, అరకొర ఉన్న చోట ఇప్పటికీ ఆ భూములను రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీకి అప్పగించకపోవడంతో ఏపీఐఐసీ చేతులెత్తేసింది. దీంతో మే 1న నేడు సీఎం చంద్రబాబు ద్వారా వర్చువల్‌గా వీటికి శంకుస్థాపన చేసే అవకాశం లేకపోవడంతో వాటిని పక్కన పడేసింది. ప్రస్తుతం చేతికి భూములు వచ్చిన పిఠాపురం, జగ్గంపేట, రామచంద్రపురం,పెద్దాపురం, కాకినాడరూరల్,రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గాల్లోనే తొలి విడత కింద పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ నిర్ణయించింది.వీటిలో రూ.9.20కోట్లతో చిన్న, మధ్య తరహా కంపెనీలకు ప్రభుత్వమే కార్యాలయాలు నిర్మించి అద్దెకు కేటాయించనుంది. ప్లగ్ అండ్ ప్లే విధానంలో వీటిని అన్ని సౌకర్యాలతో ప్రభుత్వం నిర్మించి కంపెనీలకు కేటాయిస్తుంది. నేరుగా కంపెనీలు ఇందులో ఏ ఇబ్బంది లేకుండా కార్యకలాపాలు ప్రారంభించవచ్చు.ఈ మేరకు నిధులు విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ఏపీఐఐసీ నివేదిక పంపింది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో భూముల్లేకపోవడంతో ఏపీఐఐసీకి కల్వచర్లలో సొంతంగా ఉన్న 104 ఎకరాల్లో ప్లాట్లను పరిశ్రమలకు కేటాయించేలా త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుంది. ఈ లేఅవుట్‌కు సీఎం చంద్రబాబు నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు.కాకినాడ రూరల్, పెద్దాపురంలోను భూముల్లేవు. ఉన్న కొద్దిపాటి ఏపీఐఐసీ భూముల్లో సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు.వీటికి కూడా సీఎం నేడు శంకుస్థాపన చేయనున్నారు. ఏపీఐఐసీ భూములు మినహాయిస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కేవలం పిఠాపురం, జగ్గంపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోనే సీఎం ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు వర్చువల్ శంకుస్థాపన చేయనున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూముల లభ్యత అసలు లేకపోవడం, ఉన్న అరకొర విస్తీర్ణం ఎప్పటికి రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీకి అప్పగిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

పరిశ్రమలు ఇక్కడే..

- కాకినాడ జిల్లా పిఠాపురంలో 4.05 ఎక రాలు,కాకినాడరూరల్ వాకలపూడిలో ఏపీఐఐసీకి ఉన్న 2.99 ఎకరాలు, పెద్దాపురంలో 27 ఎకరాలను సిద్ధం చేస్తున్నారు. జగ్గంపేటలో 1.81 ఎకరాలు మాత్రమే గుర్తించారు. గండేపల్లిలో 3.39 ఎకరాలు, ప్రత్తిపాడు మండలం శంఖవరంలో 2.82 ఎకరాలు, తుని హంసవరంలో ఏడెకరాలు ప్రభుత్వ భూములు ఉన్నట్టు అధికా రులు తేల్చారు. కాకినాడ జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు 700 ఎకరాలు కాకపోయినా 400 ఎకరాలైనా ఉంటే చాలని అధికారులు భావిస్తే 49.06 ఎకరాలు గుర్తించారు.
- తూర్పుగోదావరి జిల్లాలో అనపర్తి నియోజకవర్గం రంగంపేటలో 8.90 ఎకరాలు గుర్తించారు.రాజమహేంద్రవరంలో సెంటూ కూడా లేదు.రాజానగరంలోని కోరుకొండలో 12.50 ఎకరాలు , రాజమహేంద్రవరం రూరల్ నిడిగట్లలో 12.50 ఎకరాలు ఉన్నట్టు గుర్తించారు. ఒక్క కొవ్వూరులోని తాళ్లపూడిలో 271 ఎకరాలు ఉన్నాయి. నిడదవోలులో సెంటు కూడా దొరకలేదు. గోపాలపురంలో 13.22 ఎకరాలు గుర్తించారు. తూర్పుగోదావరి జిల్లాలో 318 ఎకరాలు ఉన్నట్టు తేలింది.ఇందులో 80 శాతం భూములు కొవ్వూరులోనే ఉన్నాయి.
- కోనసీమ జిల్లాలో ముమ్మిడివరం, రాజోలు, గన్నవరం నియోజకవర్గాల్లో సెంటూ కూడా దొరకలేదు. రామచంద్రపు రంలోని ద్రాక్షారామలో 3.99 ఎకరాలు,అమ లాపురంలోని ఉప్పలగు ప్తంలో 6.83 ఎకరాలు, మండపేటలోని కేశ వరంలో 24.84 ఎకరాలు, కొత్తపేటలో 1.16 ఎక రాలు ఉన్నట్టు రెవెన్యూ అధికారులు ఏపీ ఐఐసీకి నివేదిక పంపారు. కోనసీమ జిల్లాలో మొత్తం 36.82ఎకరాలు ఉన్నట్లు తేల్చారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వాసు

4 నుంచి డీఎస్సీ మాక్‌టెస్ట్‌లు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఎస్‌జీటీ అభ్యర్థులకు తన సొంత ఖర్చుతో రాజమహేంద్రవరంలో మాక్‌టెస్టులు నిర్వహిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. రాజమహేంద్రవరం గౌతమి గ్రంథాలయంలో బుధవారం విలేకరుల తో మాట్లాడారు.ప్రభుత్వం రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. దీనిలో ఎస్‌జీటీ పోస్టులు 6599 ఉన్నాయన్నారు. డీఎస్సీ అభ్యర్థులకు పరీక్ష ఫీవర్ పోగొట్టడానికి మాక్ పరీక్ష ప్రశ్నాపత్రాలు సిద్ధం చేస్తున్నామన్నారు.మే నెల 4 నుంచి రాజమహేంద్రవరం మోరంపూడిలో అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా స్లాట్‌ల విధానంలో మాక్ టెస్టులు జరుగుతాయన్నారు. స్లాట్‌కు వంద మంది చొప్పున పరీక్షలు రాస్తారని చెప్పారు. ఈ నెల 4న మొదటిస్లాట్, 11న రెండో స్లాట్, 18న మూడో స్లాట్, 25న నాల్గో స్లాట్‌లో ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ మేరకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏబిసిటీ.ఇన్ వెబ్ సైట్, క్యూఆర్ కోడ్ విడుదల చేశారు.సింహాచలం ఆలయంలో భక్తుల మృతికి సంతాపం తెలిపారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు,వర్రే శ్రీనివాసరావు,కంటిపూడి శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్‌గా రవి



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం జిల్లా ప్రజారవాణా కార్యాలయం (ఆర్టీసీ) పర్సనల్ ఆఫీసర్‌గా కె.రవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కార్యాలయంలో పనిచేస్తున్న రవి అదే హోదాలో పర్సనల్ ఆఫీసర్‌గా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్సనల్ ఆఫీసర్‌గా ఆయన ఇక్కడి నుంచే విధులు నిర్వర్తించనున్నారు.ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ఉద్యోగులు కలసి అభినందనలు తెలిపారు.

హాస్టళ్లు పరిశీలించిన నాయక్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ బుధవారం జిల్లాలో పర్యటించారు. జిల్లాలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద సాంఘిక, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో చేపడుతున్న పనులు పరిశీలించారు. రాజమహేంద్రవరం సిటీలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని, ప్రి మెట్రిక్ బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజన వసతి, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్వయంకృషి కోచింగ్ సెంటర్‌ను సందర్శించి అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన నాయక్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ చిన్నరాముడు, ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి ఎంఎస్ శోభారాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి కేఎస్ జ్యోతి, బీసీ సంక్షేమ అధికారిణి బి.శశాంక తదితరులు ఉన్నారు.



రాష్ట్ర సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, చిన్నరాముడు

ప్రధాని సభకు 360 బస్సులు

ఆర్టీసీ 110.. స్కూల్ బస్‌లు 250

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో మే 2వ తేదీన ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగ సభ కోసం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులు బస్సుల కేటాయింపునకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆర్టీసీ అధికారులు జిల్లా నుంచి 110 బస్సులు, రవాణాశాఖ అధికారులు 250 స్కూల్ బస్సులను తరలిస్తున్నారు. ఇవన్నీ గురువారం రాత్రికే నిర్దేశిత జిల్లాలకు చేరుకోనున్నాయి. జిల్లా నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులను గుంటూరు జిల్లా ఆర్టీసీ ఆర్‌ఎంకు, స్కూల్ బస్సులను ఎన్టీఆర్ కృష్ణా జిల్లా రవాణాశాఖ అధికారులకు హేండోవర్ చేస్తారు.మే 2వ తేదీ ఉదయం నిర్దేశిత ప్రాంతాలకు ఆయా బస్సులు పంపించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

వర్రీ..ఖుడు!

అన్నదాతల ఆశలపై నీళ్లు

గోపాలపురం/తాళ్లపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అకాల వాన ముంచేస్తోంది.. అన్నదాతలను పరుగులు పెట్టిస్తోంది.జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి కురిసిన వానతో అన్నదాతలు ఉరుకులు పరుగులు పెట్టారు.రాజమహేంద్రవరం, తాళ్లపూడి, గోపాలపురం తదితర మండలాల్లో వరుణుడు రైతుల ఆశలపై నీళ్ల చల్లాడు.మంగళవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉండడంతో రైతులు కళ్లాల్లో ధాన్యాన్ని వదిలేశారు. అయితే రాత్రి ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి చినుకులు పడ్డాయి. తాళ్లపూడి మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి వర్షం కురిసింది. గజ్జరం అన్నదేవరపేట గ్రామాల మధ్య రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం తడిచి ముద్దయ్యింది. రైతులు వర్షం నీరు పోవడానికి రోడ్డు వారగా గాడులు తీసి నీటిని తొలగించే ప్రయత్నం చేశారు. రైసు మిల్లర్లు సకాలంలో సంచులు ఇవ్వక పోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తాడిపూడి చెందిన కౌలు రైతు పడాల పోసియ్య, పైడిమెట్ట గ్రామానికి చెందిన బోడ పాటి ప్రసాద్ వాపోయారు. ఏది ఏమైనా అకాల వర్షానికి తడిచిన ధాన్యంతో రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. మరో వైపు ఈదురుగాలులకు మామిడి నేలరాలుతోంది. గోపాలపురం మండలంలో మంగళవారం రాత్రి సుమారు రెండు గంటల పాటు బలమైన ఈదురుగాలులు వీచాయి. దుమ్ము రేగడంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది రంగంలో దిగి విద్యుత్ వైర్లపై పడిన చెట్లను రాత్రికి రాత్రే తొలగించి విద్యుత్ పునరుద్ధరణ చేశారు. ఇదిలా ఉంటే ఆకాశంలో కమ్మిన కారుమబ్బులకు ఇటు వరి, అటు మొక్కజొన్న రైతులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈదురుగాలులు వీచినా వర్షం కురవకపోవడంతో మొక్కజొన్న , ధాన్యం రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ఈదురుగాలులకు మామిడి రైతులు బలైపోయారు.



వరి రైతు ఇక్కట్లు.. నేల రాలిన మామిడికాయలు





జిల్లా క్రీడా మైదానంలో స్విమ్మింగ్ చేస్తూ...



ఫుట్‌బాల్ ఆడుతూ...

పరీక్షలు ముగిశాయి. వేసవి సెలవులు ఇచ్చేశారు. ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీపట్టిన పిల్లలకు స్వాతంత్ర్యం లభించినట్లయింది. ఇప్పుడు పూర్తిగా ఇంటిపట్టునే ఉండడంతో వారు చేసే అల్లరి అంతాఇంతా కాదు. దీనికి పరిష్కారంగా చాలా మంది పెద్దలు సమ్మర్ క్యాంప్స్‌ను ఎంచుకుంటున్నారు.

ఒకే సమయంలో అటు ఆటలు, ఇటు విజ్ఞానాన్ని అందించే ఈ వేసవి శిబిరాలు ప్రస్తుతం పిల్లలను కూడావిపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఇంతకు ముందులా వీరు సెలవుల్లో అమ్మమ్మ, తాతయ్య ఊర్లకు వెళ్లకుండా సమ్మర్ క్యాంప్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు.

ఆటాడుకుందాం... రా!

(కాకినాడ కార్పొరేషన్-ఆంధ్రజ్యోతి)

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏదైనా కళలోను, క్రీడలోనో ప్రావీణ్యత ఉండడం అనే విషయాన్ని చదువుతో పాటు మరో అదనపు అర్హతగా గుర్తిస్తున్నారు. కాబట్టి చదువు ఒక్కటే సరిపోదని భావించడమే దీనికి కారణంగా చెప్పుకోవచ్చు. అందుకే వేసవి సెలవులను వృథాగా పోనీయకుండా ఓ కొత్త కళను నేర్చుకునేందుకు లేదా ఓ కొత్త పనిలో ప్రావీణ్యం సంపాదించేందుకు అటు పెద్దలు, ఇటు పిల్లలు ఉత్సాహం చూపిస్తున్నారు.

పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి

తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బయటపడే ఆటలను ఎంపిక చేసుకోవడం ముఖ్యం. ఎందుకంటే ఆస్తమా లాంటి సమస్యలు ఉండే చిన్నారులు స్విమ్మింగ్ చేయడం మంచిది కాదు. ఒక్కో చిన్నారి దేహదారుఢ్యం ఒక్కోలా ఉంటుంది. కాబట్టి టెన్నిస్ లాంటి ఇండివిడ్యువల్ స్పోర్ట్స్ లేదా బాస్కెట్ బాల్ లాంటి గ్రూప్ యాక్టివిటీస్‌లో చేర్పించడం ఉత్తమం.

పిల్లలు ప్రతి ఒక్కరిలోనూ సృజనాత్మకత దాగి ఉంటుంది. దాన్ని గుర్తించి వెలికితీయడమే సమ్మర్ క్యాంప్‌ల ముఖ్య ఉద్దేశ్యం. సరదా కోసం మాత్రమే కాకుండా పిల్లలు ఆడుతూ, పాడుతూ ఎన్నో కొత్త విషయాలను ఈ వేసవి శిబిరాల్లో నేర్చుకుంటారు. ఇక్కడ నేర్చుకున్నవి భవిష్యత్తులో ఉపయోగపడడమే కాకుండా చిన్నారుల్లో జ్ఞాపకశక్తిని మరింతగా మెరుగుపరుస్తుంది.

ఇలాంటి శిబిరాల ద్వారా కొన్ని స్వప్రయోజనాలున్నాయి. సెలవుల కారణంగా తమ స్నేహితులను మిస్సయ్యామనుకునే పిల్లలకు ఈ శిబిరాల్లో ఇతర పిల్లలతో కలవడం ద్వారా ఆ ఫీలింగ్ దూరమవుతుంది. కొత్త స్నేహితులు ఏర్పడతారు. ఈ కేంద్రాల్లో ఉండే పలు రకాలైన క్రీడా పరికరాలతో పిల్లల ఆటపాటలకు ఏమాత్రం కొదువుండదు.

క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఏటా వేసవిలో ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహిస్తోంది. విద్యార్థులకు ఆయా క్రీడాంశాల్లో ఆసక్తి పెంపొందించడంతో పాటు వారు రాణించేలా నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇప్పి స్తోంది. అర్హత కలిగిన శిక్షకుల నుంచి ఇప్పటికే దరఖాస్తులు ఆహ్వానించి ఎంపిక చేసింది. కాకినాడ జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో శిక్షణ అందించేందుకు సమాయత్తమవుతోంది.



బాస్కెట్‌బాల్ సాధన చేస్తూ...

ఈ ఏడాది కాకినాడ జిల్లాలో 24 క్రీడాంశాల్లో 50 కేంద్రాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఒక్కో క్యాంపులో 8 నుంచి 14 ఏళ్లలోపు గల 25 మంది బాలురు, 25 మంది బాలికలకు మాత్రమే శిక్షణ అందజేస్తారు. ఎంపిక చేసుకున్న క్రీడాంశంలో నెల పాటు ఉచిత శిక్షణ ఇస్తారు. బాక్సింగ్, బ్యాడ్మింటన్ వంటి ఇండోర్ క్రీడలతో పాటు హాకీ, క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి అవుట్‌డోర్ క్రీడల్లో సైతం తర్ఫీదు ఇవ్వనున్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తారు.



షటిల్ ప్రాక్టీస్...

- పిల్లల మనోల్లాసానికి సమ్మర్ క్యాంప్స్
- మే 1 నుంచి 31 వరకు శిక్షణ
- కాకినాడ జిల్లావ్యాప్తంగా 24 క్రీడాంశాల్లో 50 శిబిరాలు
- 2,500 మంది చిన్నారులకు అవకాశం



జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు సంబంధించి కాకినాడ, తుని, సామర్లకోట స్టేడియాల్లో నెల పాటు వివిధ క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ ఇస్తాము. క్రీడా శిబిరాలను, శిక్షకులను ఎంపిక చేశాము. బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలి.

బి.శ్రీనివాస్‌కుమార్
జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, కాకినాడ

లాల్ సలామ్

మేడే..ఈనాడే



- తరాలు మారినా మారని కార్మికుల తలరాతలు
- దానికి తోడు వైసీపీ హయాంలో మొండిచెయ్యి
- పథకాలు, మండళ్లు రద్దు
- ప్రస్తుతం 'ఈ-శ్రమ్' ఒకటే దన్ను
- తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 6లక్షల మంది శ్రామికులు
- నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక లోకం లేకపోతే ప్రపంచంలో ఏ రంగమూ ముందుకు కదలదు. అయితే ఏళ్లకు ఏళ్లుగా వారి జీవితాల్లో మాత్రం వెలుగులు లేవు. తరాలు మారుతున్నా తలరాతలు మారట్లేదు. శ్రమనే నమ్ముకుని బతుకులను కష్టాలతో నెట్టుకొస్తున్నారు. పారిశుధ్యం, భవన నిర్మాణం, వ్యవ సాయం... ఇలా ఏ రంగంలోనూ కార్మికులు లేనిదే పని జరగదు. ఏదో ఒక రూపంలో కార్మిక శక్తి ఆయా రంగాల్లో చోదకశక్తిగా ఉంటోంది. కానీ వారి హక్కులు మాత్రం హననానికి గురవుతూనే ఉన్నాయి. ఒక ప్రభుత్వం మంచి చేయాలని సంకల్పిస్తే.. మరో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ దురుద్దేశాలతో ముందు పాలకుల పథకాలను నిర్దాక్షిణ్యంగా నిలిపివేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అదే జరిగింది. గత నాలుగేళ్లుగా కార్మికులకు మేలు జరగ్గపోగా అప్పటికే వారికి అందుతున్న సంక్షేమ పథకాలను నిలిపేసింది. కార్మిక చట్టాలు, కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం అమలు కోసం కార్మికులు యథావిధిగా ఎదురు చూస్తూనే ఉన్నారు. నేడు కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక లోకానికి లాల్ సలామ్ చెప్తూ... ప్రత్యేక కథనం.

● రాష్ట్ర వేడుకలు రద్దు

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం వేడుకగా నిర్వహించేది. కార్మికులకు సత్కారాలు చేయడం, వారి సమస్యలపై దృష్టి పెట్టడం జరిగేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం వేడుకలను నిలిపివేసింది. ఎవరైనా స్వచ్ఛందంగా కార్యక్రమాలు చేసుకుని అధికారులను ఆహ్వానిస్తే హాజరయ్యే పరిస్థితిని తీసుకొచ్చింది. దీంతో నాలుగేళ్లుగా కార్మిక దినోత్సవాన్ని కూడా నిర్వహించట్లేదు.

● అన్నీ నిలిపివేత

టీడీపీ ప్రభుత్వంలో అప్పటిదాకా అమలుచేసిన సంక్షేమ పథకాలను సైతం వైసీపీ ప్రభుత్వం రద్దు చేసేసింది. కొన్నిటిని హోల్డులో పెట్టింది. భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంక్షేమ మండలిని కూడా నిర్వీర్యం చేసింది. అసంఘటిత రంగంలో.. బతుకులకు ఏ కష్టం వచ్చినా భరోసా లేని భవన నిర్మాణ తదితర కార్మికులకు పూర్తిగా అన్యాయం జరిగింది. మరణించిన కార్మికుని కుటుంబాన్ని అదుకునేవారే కరువయ్యారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో కార్మిక మండళ్ల ద్వారా కార్మికుల పిల్లల వివాహాలు, చదువులకు చేయూత అందించేవారు. సహజ మరణానికి రూ.2-3లక్షలు, అంగవైకల్యానికి గురైతే రూ.లక్ష, ప్రమాదశాత్తు మృతి చెందితే రూ.5లక్షలు బాధితుల కుటుంబాలను ఎంతో కొంత ఆదుకునేవి. గత వైసీపీ ప్రభుత్వంలో వాటిని క్రమేపీ రద్దు వరకూ తీసుకొచ్చారు. చివరకు మహిళా కార్మికులకు ప్రసూతి సహాయం కింద ఇచ్చే రూ.50 వేలనూ నిలిపివేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఈ-శ్రమ్ కార్డులు మాత్రమే వారికి ప్రభుత్వాల తరఫున ఉన్న దన్నుగా కనిపిస్తున్నాయి. ఇక సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోర్టులు ఆదేశిస్తున్నా అమలు జరగట్లేదు. కనీస వేతనాల పరిస్థితీ అంతే. గ్యాస్ డెలివరీ బాయ్స్, పెట్రోలు బంకుల్లో పనిచేసేవారు.. తదితర కొన్ని రంగాల్లోని కార్మికులకు కనీసం వేతనాల మాట అటుంచితే అసలు జీతాల చెల్లింపే ఉండదు. వారికి వినియోగదారులు దయతలచి ఇచ్చే డబ్బులే జీవనోపాధి అనే నిజం కలచివేస్తోంది. చిన్న పని దొరికితే ఆ రోజు గడుస్తుందనే పరిస్థితుల్లో ఉన్న ఎంతోమంది భవన నిర్మాణ రంగ కార్మికులను రోజూ నగరాలు, మండల కేంద్రాల్లోని ఆయా ప్రదేశాల్లో చూడవచ్చు. కాంట్రాక్టు సంస్థలు/వ్యక్తులు కార్మికుల చెమట కష్టంలో సైతం కమీషన్ తీసుకుంటూ దోపిడీకి పాల్పడుతూనే ఉన్నారు.

● జిల్లాలో 6లక్షల మంది

తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో సుమారు 4లక్షల మంది అసంఘటిత, దాదాపు 2లక్షల మంది సంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. కార్మిక శాఖ వారి సమస్యలకు చట్ట ప్రకారం పరిష్కారం చూపుతోంది. అసంఘటిత రంగ కార్మికుల్లో ఇప్పటికే 3.50 లక్షల మందికి ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. మిగతా వారికి పూర్తి చేయడానికి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తోంది.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

బీఎస్ఎం వలీ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, తూర్పు గోదావరి (ఇన్చార్జి అధికారి)

సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల వృత్తిపరమైన, ఇతర సమస్యలను తీర్చడానికి ఎప్పుడూ సిద్ధమే. కేసుల పెండింగుని 75 నుంచి 3కు తీసుకొచ్చాం. దీంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు గట్టిగా కృషి చేస్తున్నాం. గత ఏడాదిలో 28 కేసులు నమోదు చేశాం. అసంఘటిత రంగ కార్మికులు, ప్లాట్‌ఫాం వర్కర్లు (యాప్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ఆధారంగా పని చేసేవారు) వెంటనే ఈ-శ్రమ్ కార్డు పొందాలి.

వైద్య ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలో ఖాళీగా ఉన్న వైద్య ఉద్యోగాలభర్తీకి దరఖాస్తులు కోరుతున్నామని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సౌభాగ్యలక్ష్మి తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కంప్యూటర్ ప్రోగ్రామర్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ ట్రైనర్ (పీఈటీ), ఎలక్ట్రికల్ హెల్పర్, మార్చురీ అటెండెంట్, ఆఫీస్ సబార్డినేట్, అనస్థీషియా టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, స్పీచ్ థెరపిస్ట్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, జనరల్ డ్యూటీ అటెండెంట్, స్టోర్ అటెండెంట్, సైకియాట్రిక్ సోషల్ వర్కర్, చైల్డ్ సైకాలజీ, క్లినికల్ సైకాలజిస్ట్, ల్యాబ్ అటెండెంట్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి చేసిన తమ దరఖాస్తులను మే 1వ తేదీ నుంచి 12వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ప్రభుత్వ వైద్యకళాశాల కార్యాలయంలో అందజేయాలని ఆమె పేర్కొన్నారు.

నేడు మేడే ర్యాలీ, బహిరంగ సభ

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ రాక

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 1వ తేదీ గురువారం సీపీఐ, ఏఐటీయూసీ, రాజమండ్రి జట్టు లేబర్ యూనియన్, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులతో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉదయం 9 గంటలకు రాజమండ్రి జట్టు లేబర్ యూనియన్ కార్యాలయం నుంచి కార్మిక ప్రదర్శన ప్రారంభమవుతుందని, షెల్టన్ హోటల్ సమీపంలోని ఆవ వాటర్ ట్యాంకుల వద్ద బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొంటారని, కార్మికులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాడపల్లి స్వామి, అమ్మవార్లకు నగలు బహూకరణ

● ఓ భక్తురాలి నిలువుదోపిడీ సమర్పణ

ఆత్రేయపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం విశాఖపట్టణానికి చెందిన శ్రీ వెంకటకృష్ణ అన్నమాచార్య సంస్థ అమ్మవారికి 46 గ్రాములతో రెండు మంగళసూత్రాలు, కేజీన్నర వెండి పళ్లెం స్వామివారికి సమర్పించారు. సంస్థ ప్రతినిధులకు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు.



స్వామి,అమ్మవార్లకు బంగారు సూత్రాలు, వెండికంచం బహూకరిస్తున్న దాతలు, నిలువుదోపిడీ సమర్పిస్తున్న భక్తురాలు

మొక్కు చెల్లించిన భక్తురాలు

కోరిన కోర్కెలు నెరవేరడంతో ఓ భక్తురాలు స్వామివారికి నిలువుదోపిడీ సమర్పించుకున్నారు. బుధవారం కుటుంబ సభ్యులతో ఆ భక్తురాలు స్వామివారిని దర్శించుకుని ఆమె ఒంటిమీద ఉన్న బంగారు వస్తువులను ముడుపు మూట కట్టి స్వామివారి హుండీలో సమర్పించుకున్నారు.

అఖిల భారత రోప్ స్కిప్పింగ్‌లో

'నన్నయ'కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల రోప్ స్కిప్పింగ్ పురుషుల విభాగంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. మహిళా విభాగంలో తృతీయ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలో క్రీడాకారులను వీసీ అభినందించి వివరాలు తెలిపారు. రాజస్థాన్‌లోని పింద్వారా మాధవ్ విశ్వవిద్యాలయంలో ఈనెల 22 నుంచి 24 వరకూ జరిగిన ఈ పోటీలలో నన్నయ అనుబంధ కళాశాల భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్నారన్నారు. అఖిలభారత రోప్ స్కిప్పింగ్ పురుషుల విభాగంలో ఐదు పతకాలు, మహిళా విభాగంలో నాలుగు పతకాలు సాధించారన్నారు. చక్కని ప్రతిభకనబరచిన ఆర్.యేసు బంగారు వెండి పతకాలు, కె.వేణుసాయి రెండు వెండి పతకాలు, ఎం.లీలాగణేష్ ఒక వెండి పతకం సాధించారన్నారు. మహిళా విభాగంలో జె.గాయత్రి, ఎం.నాగదేవి, సీహెచ్ సాయిలలిత, ఎస్ఆర్ గంగాభవానీలు ఒక్కొక్క బంగారు పతకం సాధించారని తెలిపారు. క్రీడాకారులను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధికారులు పాల్గొన్నారు.

మే 3 వరకూ బీఈడీ పరీక్షలు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 3వరకూ జరుగుతాయని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయంలోని పరీక్షా కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈనెల 29 నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలకు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ప్రస్తుతం 169 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారన్నారు.



పరీక్షాకేంద్రాన్ని పరిశీలించిన వీసీ ప్రసన్నశ్రీ


కేంద్ర న్యాయశాఖ మంత్రితో ఎంపీ సతీష్ బాబు భేటీ

కాకినాడసిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర చట్ట, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌తో బుధవారం ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో చట్ట, న్యాయవ్యవస్థకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలపై ఎంపీ చర్చించారు. ముఖ్యంగా కర్నూల్‌లో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు, న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల సంఖ్య పెంపు, న్యాయమూర్తుల ఖాళీలభర్తీ, విపత్తు ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో న్యాయస్థానాలు నిర్మాణం వంటి అంశాలపై చర్చించినట్లు ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి విడుదలచేసిన ప్రకటనలో వెల్లడించారు. అదేవిధంగా రాష్ట్ర పోలీస్‌శాఖ, న్యాయ వ్యవస్థ మధ్య సమన్వయం, కేసుల పరిష్కారంలో జాప్యం, కోర్టుల ఆధునీకరణ వంటి అంశాలను ఎంపీ సతీష్‌బాబు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



కేంద్ర మంత్రి అర్జున్‌రామ్‌ను కలిసిన ఎంపీ సానా సతీష్‌బాబు

అక్షయ తృతీయ వేళ... బంగారు రంగులో భీమేశ్వరుడు



నూతన పట్టు వస్త్రంతో స్వామివారి అలంకరణ

సామర్లకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా కాకినాడజిల్లా సామర్లకోటలోని కుమార రామ భీమేశ్వర స్వామికి పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, అంజిబాబు, వెంకన్న అభిషేకాలు జరిపారు. బాలా త్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన చేశారు. స్వామిని బంగారు వర్ణంతో కూడిన పట్టు వస్త్రంతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈవో బళ్ల నీలకంఠం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డీఆర్‌యూసీసీ మెంబర్‌గా అనిల్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారులు కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా కాకినాడ రెల్లిపేటకు చెందిన ముత్యాల అనిల్ నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు సిఫార్సు మేరకు రైల్వేశాఖ అనిల్ నియామకాన్ని ధృవీకరిస్తూ నియామక పత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎంపీ క్యాంపు కార్యాలయంలో అనిల్‌ను బుధవారం మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని) సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణమూర్తి, బండి నరేంద్ర, సాయిబాబా, బర్ల శ్రీనివాస్, జోగా రాజు, దుర్గాప్రసాద్, శ్రీమన్నారా యణ, రెల్లి సంఘం నాయకులు సత్యం, బంగారు సత్తిబాబు, సోమాదుల గోవిందు, బండి లక్ష్మీనారాయణ, శ్రీవడ్డి పోలమాంబ రెల్లికుల పంచాయతీ సంఘం పెద్దలు పాల్గొన్నారు.



అనిల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మెరుపులు, ఉరుములొస్తే పిడుగులే



ప్రజలను అప్రమత్తం చేస్తూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచనలు

సామర్లకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో నల్లని మబ్బులు, మెరుపులు, ఉరుములు కనబడితే పిడులు పడే అవకాశం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచిస్తోంది. అంతేకాదు ప్రతీ సెల్ ఫోన్‌కు పిడుగుల సమాచారాన్ని అందిస్తూ ప్రజలను కూడా అప్రమత్తం చేస్తున్నారు. పిడుగుపాటు సంకేతాలు, పిడుగులు పడే ప్రదేశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనుల వివరా లను ప్రజలకు వివరిస్తూ ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా ప్రజలను చైతన్యం చేస్తోంది. ప్రతీ ఏటా ఏప్రిల్ నెల నుంచి మే నెలాఖరు వరకూ సాయంత్రం పూట ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో పిడుగులు పడి మనుషులు, జంతువులకు ప్రాణనష్టం జరిగే అవకాశముంది. దీనిపై పలు సూచనలు, జాగ్రత్తలను వివరిస్తున్నారు.

చేయకూడనివి

- ఆరుబయట ప్రదేశాల్లో ఉండకూడదు.
- ఆశ్రయం కోసం చెట్ల కిందకు వెళ్లకూడదు.
- నీటిలో ఉండకూడదు, లోహపు పైపుల నుంచి వచ్చే నీటిని తాకకూడదు.
- సెల్‌ఫోన్ ఉపయోగించరాదు, రేకుల షెడ్ల కింద, వరండాలలో ఉండరాదు.
- ఉరుములు, మెరుపులు తదుపరి కనీసం 30 నిమిషాల వరకూ బయటకు వెళ్లరాదు. ఎలక్ట్రిక్ ఉపకరణాలు, వ్యవసాయ పంపుసెట్లు ఉపయోగించరాదు.
- ట్రాక్టర్లు, మోటారు సైకిళ్లను ఆరుబయట ఉంచరాదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



- టీవీ, రేడియోల ద్వారా వాతావరణ సమాచారాన్ని తెలుసుకుని స్థానిక హెచ్చరికలు పాటించాలి.
- బహిరంగ ప్రదేశాల్లో ఉన్నపుడు మోకాళ్ల మధ్య తల వంటి చేతులతో చెవులను మూసు కుని భూమికి తగలకుండా వంగి కూర్చోవాలి.
- గోడలు, ద్వారాలు, కిటికీలకు దూరంగా ఉండాలి.
- ఎండిన చెట్లు, విరిగిన కొమ్మలకు దూరంగా ఉండాలి. వాహనాల్లో ప్రయాణించే వారు వాటిని సురక్షిత ప్రాంతాల్లో నిలిపి అందులోనే కూర్చోవాలి.
- పశుసంపదను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.

పిడుగులు పడే ప్రదేశాలు

ఎత్తయిన ప్రదేశాలు, కొండప్రాంతాలు, పొడవైన చెట్లు, విద్యుత్, టెలీఫోన్ స్తంభాలు, టవర్‌లైన్లు, సెల్ ఫోన్ టవర్లు, విడివిడిగా ఉంటే ప్లాట్లు, ఇళ్లు, బహిరంగ ప్రదేశాల్లో పిడుగులు పడేందుకు ఆస్కారముంటుంది.

పిడుగుపాటుకు సంకేతాలు

ఆకాశంలో నల్లని మబ్బులు గుమికూడడం, మెరుపులు, ఉరుములు, వేగంగా గాలులు వీయడం వంటివి పిడుగుపాటుకు సంకేతాలుగా భావించాలి.



క్రికెట్ టోర్నీకి వెళ్లొస్తూ తిరిగిరాని లోకాలకు..

ద్విచక్రవాహనాన్ని ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఇద్దరు మృతి

వీఆర్‌పురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందిన ఘటన మండలంలోని శబరిరాయిగూడెం గ్రామ సమీపాన జరిగింది. వీఆర్‌పురం ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. రామవరం పంచాయతీలోని శబరిరాయిగూడెం గ్రామానికి చెందిన మడకం నరేష్ (34), కొప్పల్లి గ్రామానికి చెందిన కారం చంద్రయ్య (30) వీఆర్‌పురంలో మంగళవారం జరిగిన క్రికెట్ టోర్నీకి వెళ్లారు. అనంతరం రాత్రి పది గంటలకు ద్విచక్రవాహనంపై స్వగ్రామం వస్తున్న క్రమంలో శబరిరాయిగూడెం సమీపంలో రేఖపల్లి గ్రామానికి చెందిన ట్రాలీ ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. తీవ్ర గాయాలైనవారిని స్థానికులు చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నరేష్ మృతిచెందాడు. కారం చంద్రయ్యను భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 12గంటలకు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం మృతదేహాలను బంధువులకు అప్పగించామన్నారు.




నరేష్, చంద్రయ్య మృతదేహాలు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న వీఆర్‌పురం ఎస్ఐ సంతోష్‌కుమార్

పాముకాటుకు మహిళ మృతి

ఇంటి లోపల ఇరుక్కున్న సర్పాన్ని గునపాలతో హతమార్చిన స్థానికులు

అంతర్వేది, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామం బోను ప్రాంతం సమీపంలో మంగళవారం రాత్రి నాయుడు లక్ష్మిని పాము కాటు వేసింది. భయభ్రాంతులకు గురైన ఆమె కేకలు వేయగా స్థానికులు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఇంతలోనే ఆమె మరణించినట్టు వైద్యులు తెలిపారు. లక్ష్మి కుమారుడు అనారోగ్యంతో ఉండడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుడున్నాడు. సయయానికి కుమారుడు కూడా ఆసుపత్రిలో ఉండడంతో స్థానికులు తీసుకువెళ్లినా ప్రాణాలు దక్కలేదని బంధువులు తెలిపారు. బుధవారం ఉదయం లక్ష్మి ఇంట్లో స్థానికులు పొగ పెట్టి పాము కోసం వెతకగా పాము బయటకు వచ్చి మళ్లీ ఇంట్లోకి ప్రవేశించింది. స్థానికులు సాయంతో పామును వెతకసాగారు. మట్టి ఇంటిని తవ్వగా లోపల ఇరుక్కున్న పామును స్థానికులు గునపాలతో హతమార్చారు. రాజోలు ప్రభుత్వాసుపత్రిలో లక్ష్మి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



మరణించిన లక్ష్మి



స్థానికుల చేతిలో హతమైన పాము

గోదావరిలో దూకి వ్యక్తి గల్లంతు



వంతెనపై వదిలిపెట్టిన దుస్తులు

కొవ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరి దూకి వ్యక్తి గల్లంతయ్యాడు. బుధవారం వంతెన 159వ స్తంభం వద్ద చొక్కా, లుంగీ వదిలిపెట్టి వ్యక్తి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులకు పోలీసులకు సమాచారం అందించారు. దుస్తుల ఆధారంగా కొవ్వూరు పట్టణానికి చెందిన కోట్ల సత్యనారాయణ (78)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అర్ధరాత్రి వరకు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయవలసి ఉంది.

ఇంట్లోకి ప్రవేశించి మహిళలు, పిల్లలపై దాడి

ముగ్గురు యువకులపై కేసు

కరప, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి మహిళలు, పిల్లలపై దాడి చేసిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్టకు చెందిన మోకన బన్నీ, బోడా సతీష్, గుడుగుడు కాశీ గత నెల 27న రాత్రి అదే గ్రామానికి చెందిన మడిపల్లి రాజు ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించారు. తమ మోటారు సైకిల్‌ను వారింట్లో దాచిపెట్టారనే ఉద్దేశంతో రాజు భార్య సత్య, వారి పిల్లలపై దాడి చేశారు. అడ్డుకోబోయిన రాజు మేనకోడలు గుబ్బల రోజారాణి, ఆమె తల్లిపై కూడా దాడి చేశారు. దీనిపై రోజారాణి బుధవారం కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సునీత పేర్కొన్నారు.

జాతీయస్థాయి ఎన్ఎస్ఎస్ సదస్సులో శ్యామ్‌కుమార్

జేఎన్టీయూకే, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్‌లో ఎన్ఎస్ఎస్ పాత్రపై గతనెల 25, 26తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి ఎన్ఎస్ఎస్ సదస్సులో కాకినాడ జేఎన్టీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గుబిలి శ్యామ్‌కుమార్ ఏపీ నుంచి హాజరైనట్టు పీఆర్వో రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వీసీ ఛాంబరులో ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ శ్యామ్‌కుమార్‌ను అభినందించారు. తనకు ఈ అవకాశం కల్పించిన హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్‌కు, ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్‌కు శ్యామ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్‌క్రాస్ జాతీయ కార్యవర్గ సమావేశానికి రామారావు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖకు చైర్మన్‌గా ఎన్నికై జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన వైడి రామారావు తన మొదటి సమావేశానికి హాజరుకావడానికి ఢిల్లీ వెళ్లారు. ఈ నెల 2న రెడ్‌క్రాస్ జాతీయ చైర్మన్ కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జేపి నడ్డా అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు.

అక్రమంగా చెట్లు నరికి తరలింపు

సామర్లకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోదావరి కాలువ లాకుల వద్ద రోడ్డుకిరువైపులా కాలువ గట్టు వద్ద ఉన్న భారీ చెట్లను గత రెండు రోజులుగా నిబంధనలకు విరుద్ధంగా నరికివేయించి అక్రమ అక్రమాలు చేశారని పలువురు రైతులు ఆరోపించారు. ఇరిగేషన్ అధికారులు గత ఏడిది వేసవి సీజన్లో సామర్లకోట బీటీయూటీ నుంచి ముత్యాలమ్మ విగ్రహం వరకూ కాలువ గట్టుపై ఉన్న పలు చెట్లను నరికి విక్రయించడంతో అప్పట్లో రైతులు సైతం ఫిర్యాదులు చేశారు. అదే రీతిలో ఈ ఏడాది కూడా భారీ చెట్లను నరికించేందుకు అటవీ శాఖ అధికారుల అనుమతులు పొందకుండానే అధునాతన యంత్రపరికరాలతో భారీ చెట్లను నరికి వేశారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని సామర్లకోట తహశీల్దార్ చంద్రశేఖర రెడ్డికి బుధవారం రాత్రి రైతులు ఫిర్యాదు చేశారు.

సింహాచలం ఘటన బాధాకరం : యనమల

తుని రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహాచలం ఘటన బాధాకరమని, గోడకూలి భక్తులు మృతిచెందడం తనను కలిసి వేసిందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రకృతి వైపరీత్యం వల్ల జరిగిన ప్రమాదంలో బాధితులు పట్ల దేశమంతా సానుభూతి చూపిస్తుంటే మాజీ సీఎం జగన్‌మాత్రం శవ రాజకీయం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈదురుగాలులకు 21 విద్యుత్ స్తంభాలు నేలమట్టం

కిర్లంపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులు, భారీ వర్షానికి కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో సుమారు 20 విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. రామచంద్రపురం నుంచి కిర్లంపూడి మండలంలో సుమారు పది గ్రామాలకు విద్యుత్ సరఫరా వెళ్తుంది. దీంతో రామచంద్రపురం సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి కిర్లంపూడి ఎలక్ట్రికల్ ఎఈ, జగ్గంపేట ఎలక్ట్రికల్ డీఈ, అధికారులతో మాట్లాడి బుధవారం ఉదయం 20 కొత్త విద్యుత్ స్తంభాలు రామచంద్రపురం గ్రామానికి తెప్పించారు. దగ్గరుండి స్తంభాల పనులు చేయించారు.



కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు దృశ్యం

వివాహ శుభలేఖలు ఇచ్చి తిరిగి వెళ్తుండగా విషాదం

డివైడర్‌ను ఢీకొన్న స్కూటీ

రామచంద్రాపురానికి చెందిన ఒకరి మృతి, మరొకరికి గాయాలు




ప్రమాద స్థలంలో వెంకటేష్ మృతదేహం

ఎలమంచిలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కుమార్తె వివాహ శుభలేఖలు బంధువులకు ఇచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఎలమంచిలి మండలం మర్రిబంద జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలివి... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం రైస్‌పేటకు చెందిన నక్కా వెంకటేష్ (35), అనుపోజు బాబీ బావ బావమరుదులు. బాబీ కుమార్తెకు వచ్చే నెలలో వివాహం నిశ్చయం కావడంతో శుభలేఖలు విశాఖలోని బంధువులకు వచ్చి తిరిగి రామచంద్రాపురం స్కూటీపై వెళ్తుండగా మర్రిబంద సమీపంలో ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే హైవే పెట్రోలింగ్ పోలీసులు, ఎన్‌హెచ్-5 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్టు గుర్తించారు. తీవ్రగాయాలైన బాబీని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు వెంకటేష్ బంగారం పని చేస్తుంటాడని, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని ఎలమంచిలి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాబీని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

ఆర్యవటంలో సింహాద్రి అప్పన్న చందనోత్సవం



చందన రూపుడై దర్శనమిస్తున్న స్వామివారు



చందనాన్ని నూరుతున్న దృశ్యం

కాజులూరు (కరప), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఆర్యవటం శివారు చందాలవారిపేటలో బుధవారం శ్రీవరాహలక్ష్మీనరసింహ స్వామి (సింహాద్రి అప్పన్న) చందనోత్సవం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి సంకల్పం, విశ్వక్సేనారాధన, చందనం తొలగించుట, పంచామృతస్నపనం, అర్చన, బాలభోగ నివేదన, మం గళహారతి క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి నిజరూప దర్శనం కల్పించగా అధిక సంఖ్యలో భక్తులు తిలకించి తరించారు. సాయంత్రం నాలుగు గంటలకు చందన సమర్పణ చేసి స్వామివారి తిరు కల్యాణోత్సవం, పూర్ణాహుతి జరిపారు. అనంతరం నిర్వాహక కమిటీ సభ్యులు భక్తులకు తాగునీరు, అల్పాహారం, అన్నసమారాధన నిర్వహించారు.

వయసు 20.. దొంగతనాలు 35

- తప్పించుకుని తిరుగుతూ పట్టుపడిన దొంగ
- ఐదు బైక్‌లు స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 20 ఏళ్ల వయస్సులో 35 దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్న దొంగను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీసులు పట్టేశారు. విశాఖపట్నం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు ఇళ్ల దొంగతనాలు, బైక్ దొంగతనాల్లో ఆరితేరిన దొంగను పట్టేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డేగాపురానికి చెందిన జువ్వల కుమార్ రాజా అలియాస్ తరుణ్‌కుమార్, బేతా దుర్గాప్రసాద్, మామిడి దుర్గారావు ముగ్గురు కలిసి 2023లో విశాఖజిల్లా గోపాలపట్నంలో ఒక ఇంటి తాళాన్ని పగులగొట్టి దొంగతనం చేశారు అటుపై భీమవరం చిన్నఅమిరంలో బైక్, ఎన్టీఆర్ జిల్లా పటమటలో బైక్, రాజమహేంద్రవరం టూటౌన్‌లో రెండు బైక్‌లు, వీరపల్లిలో బైక్, ఉండిలో బైక్, బొమ్మూరు పరిధిలో బైక్‌ను తరుణ్, మారుబోయిన మావుళ్లు అనే దొంగతో కలిసి అపహరించుకుపోయారు. ఇందులో మావుళ్లను గత నెల 23న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని టూటౌన్ పోలీసులు తెలిపారు. అయితే బుధవారం టూటౌన్ సీఐ పి.శివ గణేష్ ఆధ్వర్యంలో క్రైమ్ పార్టీ ప్రత్యేక నిఘాపెట్టి ఐదు బళ్ల మార్కెట్ సమీపంలో రైల్వే క్వార్టర్స్ వద్ద తరుణ్‌కుమార్‌ను పట్టుకున్నారు. నిందితుడి నుంచి ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. తరుణ్‌ను చాకచక్యంగా పట్టుకున్న సీఐ శివ గణేష్, హెచ్‌సీ ఎస్.రాజశేఖర్, క్రైమ్ కానిస్టేబుల్ ఎస్‌కే రబ్బాని, కానిస్టేబుల్స్‌ను తూర్పుగోదావరి ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.



నిందితుడు, బైక్‌లతో పోలీసులు


రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు



కాకినాడలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వీర్రాజు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.15 వేలు కోట్ల ఆర్థిక గ్రాంట్ కూడా మంజూరు చేసిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. కాకినాడలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విడిపోయిన ఏపీకి అత్యాధునికమైన రాజధాని నిర్మాణం చేసేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.18వేల కోట్ల నిధులు ఇచ్చిందని, ప్రస్తుతం రూ.15వేల కోట్ల ఆర్థిక గ్రాంట్ మంజూరు చేసిందన్నారు. ప్రధాని మోదీ మే 2న రాష్ట్రానికి వస్తున్నారని, కూటమి ప్రభుత్వంలో ఏపీ ముందుకు వెళ్తుందన్నారు. రాష్ట్రంలో 11 నదుల ద్వారా రూ.50వేల కోట్లతో ఇంటింటికి మంచినీటి కుళాయి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వర రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



మోతుగూడెంలో బుధవారం ఉదయం సీలేరు నదిపై సూర్యోదయ సమయంలో కనువిందు చేసిన దృశ్యం (మోతుగూడెం, ఆంధ్రజ్యోతి)

వాటే సీన్‌లేరు

అదిరే అరటిచెట్టు



కోనసీమ జిల్లా మలికిపురం మండలం గొల్లపాలెంలో మట్టా శ్రీనివాసరావు అనే రైతు పెరటిలో వేసిన అరటి చెట్టు వృక్షంలా ఎదిగింది. 24 అడుగుల ఎత్తుకు ఎదిగి ఆశ్చర్య పరుస్తుంది. సాధారణంగా అరటిచెట్లు 15 అడుగులు మించి ఎత్తు పెరగవు. ఈ అరటి విత్తనం పేరు బూడిద పక్కీస్ రకమని, విజయనగరంలోని స్నేహితుని ఇంటి నుంచి తీసుకువచ్చినట్టు శ్రీనివాసరావు తెలిపారు.

మలికిపురం (ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్తిబాబు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గోకవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సమాజ సేవ చేయడంలో ఆర్యవైశ్యులు ముందుంటారని ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, బత్తుల బలరామ కృష్ణ అన్నారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా గోకవరం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త, టీడీపీ సీనియర్ నాయకుడు బత్తుల సత్తిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం స్థానిక గోపీకృష్ణ ఫంక్షన్ హాల్లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే జ్యోతుల, బత్తుల ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. ధార్మిక కార్యక్రమాలతో పాటు, దానధర్మాల్లోను ఆర్యవైశ్యులు ముందుంటారన్నారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే బత్తుల పేర్కొన్నారు. సత్తిబాబు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం అతడితో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రాధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యదర్శిగా ఇన్నమూరి రాంబాబు, ట్రెజరర్‌గా కంకటాల మూర్తి, మరికొందరు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తదుపరి ఎమ్మెల్యేలు నెహ్రూ, బలరామకృష్ణలను సంఘం నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గన్ని కృష్ణ, కాళ్లకూరి నాగబాబుతో పాటు కాకినాడ, కోనసీమ జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కాపునాడు సంఘాభివృద్ధికి సమష్టి కృషి

ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు రఘునరేష్

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సంఘ అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని కాపునాడు ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు గుదే రఘునరేష్ కోరారు. మంగళవారం దేవీచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, రాజానగరం నియోజకవర్గాల అధ్యక్షులు విన్నా వాసు, దేశినీడి రాంబాబు, కాళ్ల చక్రరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంటు కమిటీ కార్యదర్శులుగా దేవకివాడ చక్రపాణి, నల్లంశెట్టి వీరబాబు, ఉపాధ్యక్షుడిగా రుద్ర దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా తలారి శ్రీనివాస్, రూరల్ కార్యదర్శిగా పసలపూడి లక్ష్మీనారాయణలకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రఘు నరేష్ మాట్లాడుతూ క్రమశిక్షణకు, నిబద్ధతకు ప్రాధాన్యమిస్తూ నియామకాలు చేపడుతున్నామని, వారంతా సంఘ సభ్యులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాపునాడు రూరల్ ప్రధాన కార్యదర్శి పిల్లా దుర్గాప్రసాద్, మజ్జి శ్రీకాంత్, మీసాల గణేష్ పాల్గొన్నారు.

ఉగ్రవాద దాడికి నిరసనగా నేడు ప్రత్యేక ప్రార్థనలు

పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్ సిన్హా కొమ్మనాపల్లి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ మృతులకు ఆత్మశాంతి, దేశంలో శాంతి స్థాపన కోసం గురువారం అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నామని పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్రాధ్యక్షుడు ప్రతాప్ సిన్హా కొమ్మనాపల్లి తెలిపారు. బుధవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పహల్గాంలో జరిగిన దాడి దారుణమన్నారు. ప్రపంచ శాంతిని కోరుకునే క్రైస్తవ సమాజం దీనిని ఖండిస్తోందన్నారు. దేశంలో శాంతి నెలకొనలాలని కోరుతూ చర్చిల్లో ప్రార్థనలు చేస్తామన్నారు. కాగా ఢిల్లీ ఆంధ్రా భవన్‌లో ఈనెల 6న పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ కూడిక చేస్తున్నట్టు వచ్చిన ప్రకటనలో తమ పాస్టర్స్ ఫెలోషిప్ భాగస్వామ్యం లేదన్నారు. దానిలో తమ ఫెలోషిప్ పాల్గొనడం లేదని స్పష్టం చేశారు.

ప్రేమ పేరుతో వంచించాడు.. న్యాయం చేయండి

ఖండవల్లి లక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న ఖండవల్లి లక్ష్మి, బాధిత యువతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం గాదరాడకు చెందిన దోసపాటి రాజు అదే గ్రామానికి చెందిన వల్లూరి నివ్యగ్రేస్‌ను ప్రేమపేరుతో వంచించాడని, ఆమెకు న్యాయం చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ ఖండవల్లి లక్ష్మి డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో బాధిత యువత వల్లూరి నివ్యగ్రేస్‌తో కలిసి ఆమె మాట్లాడారు రాజు నాలుగేళ్లుగా గ్రేస్ వెంటపడి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి దగ్గరయ్యాడు. అతడి అవసరాలు తీర్చుకున్నాడు. పెళ్లి చేసుకోమంటే ఆమెకు మొఖం చాటేసి వేరొక యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడని అన్నారు. దీంతో నివ్యగ్రేస్ కోరుకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అతడిని పోలీసులు అరెస్టు చేశారని, అయితే బెయిల్‌పై వచ్చి తన మకాంను దివాన్‌చెరువు గ్రామంలో బంధువుల ఇంటికి మార్చి ఇప్పుడు వేరొక పెళ్లి చేసుకునేందుకు సిద్ధమౌతున్నాడని ఖండవల్లి లక్ష్మి చెప్పారు. ఈ విషయంలో బాధిత యువతికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. నివ్యగ్రేస్ మాట్లాడుతూ రాజు తనను మోసం చేశాడని, అతడితో తనకు వివాహం జరిపించి న్యాయం చేయాలని కోరింది. సమావేశంలో హ్యూమన్ రైట్స్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి బేబి, వల్లూరి రమణమ్మ, పాస్టర్ వల్లూరి చిన్నబాబు, వరలక్ష్మి, మద్ద సువర్ణ, కందికట్ల పాపమ్మ పాల్గొన్నారు.

వైభవంగా ఏగులమ్మ ఘటాల ఊరేగింపు



కోరుకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ నర్సాపురం గ్రామదేవత ఏగులమ్మ అమ్మవారి జాతర బుధవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య అమ్మవారి ఆలయం వద్ద పుట్టింటి వారు, అత్తింటి వారు పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవారి ఘటాలను గ్రామంలోని అంగడి గుడి వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. అనంతరం ఘటాలను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో పుట్టింటి వారైన చొంగావారు, అత్తింటి వారైన కలవల పల్లివారు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోరుకొండ సీఐ సత్యకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగరాజు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ జాతర ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్టు చొంగా వంశీ, అప్పారావు, సీతారాం, శివయ్య, పుల్లెపు వీరన్నకాపు, ఈవీ నరసింహారావు, కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమం సర్పంచ్ కడియాల పాపారావు, ఎంపీటీసీ పీతా శ్రీను, రాయిపాటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన, శిక్షణ

రాజానగరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు రాజానగరంలో బుధవారం కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీ పీవో టి.నాగమణి మాట్లాడుతూ గ్రామస్థాయిలో కిశోరి వికాసంపై ఐదుగురు సభ్యులతో కిశోరి బాలికలకు సమ్మర్ క్యాంపెయిన్ జూన్ 8నుంచి నిర్వహించనున్నామని, దీనిని ఏవిధంగా నిర్వహించాలనే అంశంపై శిక్షణ నిర్వహించామన్నారు. దీనిలో భాగంగా కిశోరి బాలికలకు వేసవి సెలవులు సందర్భంగా వారానికి రెండు రోజులు వారికి చదువు ప్రాముఖ్యత, బాల్య వివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత, మహిళా చట్టాలు తదితర విషయాలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ ఎన్ఎం దుర్గామణి, ఎన్.భూదేవి, ఎస్.సింహాచలం, రాజ్‌కుమార్, ఏఎన్ఎంలు, జీఎంఎస్కేలు అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

వృద్ధులకు గొడుగుల పంపిణీ

ధవళేశ్వరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టు కార్యాలయం వద్ద ట్రస్టు అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎండ నుంచి రక్షణకు వృద్ధులకు, దివ్యాంగులకు గొడుగులు పంపిణీ చేశారు. దాతలు జి.జయకుమార్ జయప్రద దంపతులు గొడుగులు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు.

ఘనంగా దక్షిణమూర్తి విగ్రహ ప్రతిష్ఠోత్సవం

కోరుకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబూపట్నంలో ఉమా సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ప్రారంభమమయ్యాయి. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, కలశస్థాపన, మండపారాధన, వాస్తు హోమం, దక్షిణమూర్తి విగ్రహానికి క్షీరాదివాసము, జలాదివాసము, ధాన్యాధివాసము, వస్త్రాది వాసము, పుష్పాదివాసము, ఫలాదివాసాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని నాగ వీరబాబు దంపతులతో వేద పండితులు పూజలు, హోమాలు జరిపించారు. గురువారం దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయార్చకులు తెలిపారు. కార్యక్రమంలో నాగావారి కుటుంబీకులు, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌సీ రామకృష్ణ పదవీ విరమణ సత్కారం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ డి.రామకృష్ణ పదవీ విరమణ సందర్భంగా ఆయన్ను ఎస్పీ నరసింహకిషోర్ బుధవారం సత్కరించారు. జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ డిపార్టుమెంట్‌లో సమర్థవంతంగా పనిచేసి పదవీ విరమణ పొందిన మీ భావి జీవితం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో తులతూగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కడియం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో చేపట్టిన కాలువ పూడిక తీత పనులను బుధవారం ఎంపీడీవో కె.రమేష్ పరిశీలించారు.మురమండ ముత్యాలమ్మ ఆలయం వద్ద కాలువ పూడికతీత పనిని పరిశీలించారు. కూలీల హాజరు నమోదు వివరాల రికార్డును తనిఖీ చేశారు. కూలీలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు.

సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి


ప్రత్యేకావసరాల పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని, సంక్షేమాన్ని మేళవించి సుపరిపాలన అందించడమే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బలభద్రపురం ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన బిక్కవోలు, రంగంపేట, అనపర్తి మండల్లాలోని భవిత కేంద్రాల్లోని 36 మంది ప్రత్యేకావసరాల పిల్లలకు ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో రూ.20 లక్షల విలువైన ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికి, సంక్షేమానికి తేడా తెలియని పార్టీ వైసీపీ అని ఎద్దేవా చేశా రు. వారి హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్ ఎస్ఏ నిధులు మళ్లించి నవరత్నాల పేరుతో మాయ చేశారన్నారు. తాము సూపర్ సిక్స్ పథకాలతో పాటు మహిళలు, ది వ్యాంగులకు, పేదలకు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు.భవిత సెం టర్లకు ఫిజియోథెరపిస్టులను నియమిస్తున్నామని, బిక్కవోలు ఫిజియోథెరపిస్టు మధు తన గౌరవ వేతనాన్ని తిరిగి ఆ పిల్లలకే ఖర్చు చేయ డం పట్ల అతడిని సభలో అభినందించారు. అలాగే ఈప్రాంతంలో 18 మంది చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం ఆయన దివ్యాంగ చిన్నారులకు ట్రైసైకిళ్లు, వీల్‌చైర్స్, బ్రెయిలీ కిట్లు, వినికిడి యంత్రాలు, ఎంఆర్ టీఎల్ఎం కిట్లు, రోల్ లేటర్స్ అందజేసారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఈస్టర్న్ డెల్టా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు సంబంధించి నిర్మించనున్న వాటర్‌ట్యాంక్, సంపు నిర్మాణాల స్థలాలను ఎమ్మెల్యే నల్లమిల్లి పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్ బుంగా రామారావు, ఎస్ఎస్ఏ ఏపీసీ సుభాషిణి, నాయకులు ఎన్‌వీ సుబ్బారెడ్డి, పల్లి వాసు, ఆళ్ల గోవిందు, చిట్టిబాబుచౌదరి, శివరామకృష్ణంరాజు,పడాల రాము, ఇందల వీరబాబు, పలువురు అధికారులు దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సేవలందించాలి

అనపర్తి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజావసరాలను తీర్చేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు పార్టీలకు అతీతంగా సేవలందించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం వైస్ ఎంపీపీ కర్రి దాసు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన విచ్చేశారు. ముందు పలువురు అధికారులు తమ శాఖ ప్రగతిని, పథకాలను వివరించారు. ఈ సందర్భంగా కుతుకులూరు పీహెచ్‌సీలో మందుల కొరతపై సర్పంచ్ గొల్లు హేమతులసి సభ దృష్టికి తీసుకురాగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వైద్యాధికారులను ఆదేశించారు. కెనాల్ రోడ్డుకు త్వరలో మరమ్మతులు చేపడతామని ఆర్అండ్‌బీ అధికారులు చెప్పారు. దుప్పలపూడి, ఎల్ఎన్ పురం, పీరా రామచంద్రపురం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నియోజకవర్గంలో రూ.93 కోట్లతో అభివృద్ధి చేశామని, 542 మంది మహిళలకు కట్టు శిక్షణ అందిస్తున్నామన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఏఈ వీరభద్రరావు, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అక్షరాలే అగ్ని కణాలై..

మహాకవి శ్రీశ్రీ జయంతి కార్యక్రమంలో వక్తలు


ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న లెక్చరర్ స్వర్ణశ్రీ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షరాలను అగ్ని కణాలుగా మలచి, సలసల కాగే కవిత్వాన్ని ఆధునిక సాహిత్యానికి పరిచయం చేసిన మహాకవి శ్రీశ్రీ అని రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ వై.స్వర్ణశ్రీ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ, కళాగౌతమి సంయుక్త నిర్వహణలో మహాకవి శ్రీశ్రీ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్వర్ణశ్రీ మాట్లాడుతూ ఈ శతాబ్దం మరవని ఆధునికుడిగా ఎలుగెత్తి చాటదగిన కవి శ్రీశ్రీ అన్నారు. గౌరవ అతిథిగా ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి విచ్చేసి మాట్లాడుతూ కవిత్వమే ఊపిరిగా బతికిన మహాకవి శ్రీశ్రీ అన్నారు. తెలుగు విభాగాధిపతి పీవీబీ సంజీవరావు, అధ్యాపకులు పల్లి సుధ, ఏవీఎన్‌డీ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.శరత్‌బాబు, కె.శాంతి, జి.రాంబాబు, చీర్ల సీతారామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కడియం: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవినిర్మల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రి కళా సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కర్షక, శ్రామిక, పీడిత, నిమ్న వర్గాల అభ్యున్నతి కాం క్షించే సాహిత్యం శ్రీశ్రీది అని పేర్కొన్నారు. వేదిక్ గణితంలో శ్రీనివాస్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చా రు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావు, బోణం సత్యనారాయణ, జనసేన నాయకులు కళ్యాణం సూరిబాబు, ము గతా లంకేశ్వరరావు, గారపాటి తాతబ్బాయి, వే ములూరి భాస్కరావు, రామారావు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని తెలుగుశాఖలో శ్రీశ్రీ జయంతిని బుధవారం నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగుశాఖ కోర్సు కోఆర్డినేటర్ డి.లక్ష్మీనరసమ్మ విభాగ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్ బీ, సీ వ్యాక్సిన్లు అందించాలి

డాక్టర్ వసుంధర

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడేలా చర్యలు తీసుకోవాలని, అలాగే తప్పనిసరిగా హెపటైటిస్ బీ, సీ పరీక్షలు చేయించ డంతోపాటు వ్యాక్సిన్ అందించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర అన్నారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి ఆవరణలోని ఏఆర్‌టీ కేంద్రంలో ఏఆర్‌టీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, వైద్యాధికారి డాక్టర్ కిరణ్, డాక్టర్ సునీత, కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రవాద దాడిని నిరసిస్తూ బుధవారం రాత్రి రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శోభనాద్రి శాస్త్రి మాట్లాడుతూ ఉగ్రవాద దాడిలో మరణించిన వారి ఆత్మశాంతి చేకూరాలన్నారు. ఉగ్రవాద దాడిని యావత్ ప్రపంచ ఖండించాలన్నారు. బార్ అసోసియేషన్ నుంచి ఈ కొవ్వొత్తుల ర్యాలీ ప్రారంభమై పుష్కరాల రేవు వరకు సాగింది. ర్యాలీలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పెళ్లూరి రమేష్, కోశాధికారి కర్ర హనుమంతరావు, జాయింట్ సెక్రటరీ మల్కా శ్రీనివాస్, సీనియర్ సభ్యులు మల్లపరాజు, సభ్యులు సాయిప్రశాంత్, శ్రీధర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్

» 4 పరీక్షా కేంద్రాల్లో 2391 మంది అభ్యర్థుల హాజరు
» 279 మంది గైర్హాజరు


గైట్‌లో పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న అభ్యర్థులు

రాజానగరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ పాలిసెట్-2025 ప్రవేశ పరీక్షలు రాజానగరం మండలంలో బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. దీనిలో భాగంగా గోదావరి గ్లోబల్ యూనివర్శిటీలో రెండు పరీక్షా కేంద్రాల్లోనూ 1793 మంది అభ్యర్థులకు గానూ 1618 మంది పరీక్షకు హాజరైనట్టు గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పీజీ రామానుజం, వైస్ ప్రిన్సిపాల్ టి.రామారావు తెలి పారు. గైట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 860 మంది అభ్యర్థులకు గానూ 773 మంది, ఆర్‌కే బ్లాక్‌లో ఏర్పాటు చేసిన మరో పరీక్షా కేంద్రంలో 933 మందికి 845 మంది హాజరైనటుట చెప్పారు. ఈ రెండు పరీక్షా కేంద్రాల్లోనూ 175 మంది పరీక్షకు గైర్హాజరైనట్టు చెప్పారు. అలాగే మండలంలో తూర్పు గోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లోనూ 888 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 781 మంది పరీక్షలకు హాజరుకాగా, 107 మంది గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ రాజశ్రీరావు, అశోక్ తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ పి.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీవీసీలో 708 మంది హాజరు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) రాజానగరం మండలం పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో 708 మంది అభ్యర్థులు పాలిసెట్ పరీక్షకు హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు కె.నగేష్, కె.వీరబ్బాయి తెలిపారు. ఒక్కొక్క కేంద్రానికి 400మంది అభ్యర్థులను కేటాయించారన్నారు. అయితే వారిలో 92 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని చెప్పారు. పరీక్షలు గట్టి పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసాయని తెలిపారు.

పీఎంపీలకు వైద్య విజ్ఞాన సదస్సు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పీఎంపీలు ఎప్పటికప్పుడు నూతన వైద్య విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని పీఎంపీ రాష్ట్రాధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు అన్నారు. మంగళవారం పీఎంపీ రాజమండ్రి కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుక్కుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్లో మండలాధ్యక్షుడు అబ్దుల్ రహమాన్‌ఖాన్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మణికంఠ చౌదరి అధునాతన శస్త్ర చికిత్సలోని ప్రాధాన్యాన్ని, డాక్టర్ ఆనంద్‌చౌదరి అత్యాధునిక రోబో సర్జరీ ట్రీట్‌మెంట్, డాక్టర్ ఎం.ఆదిత్య ప్లాస్టిక్ సర్జరీ ఆవశ్యకతను, డాక్టర్ శ్రీదేవి ఊపిరితిత్తుల వ్యాధులు, డాక్టర్ ప్రశాంత్ అత్యవసర ట్రామా కేసుల్లో పీఎంపీలు అందించగల చికిత్సలపై అవగాహన కల్పించారు. అనంతరం పీఎంపీలకు శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, కార్యదర్శి పి.దేవానందం, పి.చిన్ని, మట్టా రమేష్, యు.ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

రాజమండ్రి ప్రతిష్ఠను దిగజార్చొద్దు

టీడీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చిన్నరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ భరత్‌రామ్ ఫేస్‌బుక్ రీల్స్ కోసం రాజమహేంద్రవరం ప్రతిష్ఠను దిగజార్చుతున్నాడని టీడీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు, బేసరి సన్ని విమర్శించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నీచ రాజకీయాల కోసం రాజమహేంద్రవరాన్ని అప్రతిష్ఠపాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఒక చానల్‌లో ప్రసారమైన దానిని ఎడిట్ చేసి దానిని ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసిన భరత్.. అసలు నగరంలో స్పాసెంటర్లు అతడి నిర్వాకమే అనే విషయాన్ని మర్చిపోయాడన్నారు. వైసీపీ పాడు చేసిన వ్యవస్థలను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందని నగరంలో పరిస్థితిని ఎమ్మెల్యే వాసు సరిదిద్దుతున్నారని చెప్పారు. సమావేశంలో యర్రంశెట్టి రాజ్‌కుమార్, కానేటి ప్రభుదాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిందలు మోపితే సహించం

టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు శేషారత్నం

అనపర్తి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అరాచకాలు చేసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి వాటిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై మోపేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇటువంటి చర్యలను సహించబోమని టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కర్రి శేషారత్నం అన్నారు. బుధవారం అనపర్తి ఎన్డీయే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దోమాడలో జరిగిన ఆక్రమణల తొలగింపు విషయంలో ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో దోమాడలో వేసిన లేఅవుట్‌కు అనుమతులు ఇప్పించింది మాజీ ఎమ్మెల్యేనే అని అన్నారు. పేదలపై ఇంత ప్రేమ చూపుతున్న ఆయన ఆర్ఎస్‌పేటలో కామాక్షి మృతికి, పులగుర్తలో ఆనందరావు మృతికి, అనపర్తిలో కర్రి అరుణకుమారి మృతికి కారకులెవరో గుర్తు తెచ్చుకోవాలన్నారు. సమావేశంలో మహిళా నేతలు గొల్లు హేమతులసి, ఒంటిమి గౌతమి, సిరసపల్లి లక్ష్మి, మల్లేశ్వరి, సుభాషిణి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసు.. ఆరుగురికి రూ.60 వేల జరిమానా

గోకవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఆరుగురికి రాజమహేంద్రవరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జరిమానా విధించినట్టు బుధవారం గోకవరం ఎస్ఐ వీఎన్‌వీ.పవన్‌కుమార్ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన ఆరుగురికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున రూ.60 వేలు జరిమానా విధించారన్నారు. బహిరంగంగా మద్యం తాగిన 20 మందికి, ప్రజాశాంతికి భంగం కలిగించిన 13 మందికి మెజిస్ట్రేట్ జరిమానా విధించడం జరిగిందన్నారు. బహిరంగంగా మద్యం తాగినా, మద్యం తాగి వాహనం నడిపినా ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు. వాహనదారులు కనీస నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం నేరమన్నారు.

స్త్రీనిధి రుణాల పంపిణీలో బిక్కవోలు ముందంజ

బిక్కవోలు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వయం సహాయక గ్రూపులకు స్త్రీనిధి రుణాల పంపిణీలో బిక్కవోలు మండలం ముందంజలో నిలిచిందని ఏపీఎం టి.సుప్రియ బుధవారం తెలిపారు. 2024-25లో మండలంలోని 256 గ్రూపులకు రూ.7.50 కోట్లు రుణాలివ్వాలని లక్ష్యం ఇవ్వగా తాము 298 గ్రూపులకు రూ.8.50 కోట్లు రుణాలు అందజేసామన్నారు. దీంతో డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్. మూర్తి, ఏజీఎం ధర్మేంద్ర తనను అభినందిస్తూ మెమెంటో అందజేశారన్నారు.

బిక్కవోలులో సత్తెమ్మ తల్లి ఆలయ ప్రారంభం

బిక్కవోలు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మునసబుపేటలో నూతనంగా నిర్మించిన సత్తెమ్మ తల్లి ఆలయం బుధవారం ప్రారంభించారు. ముందుగా అమ్మవారి విగ్రహం మంగళవారం రాత్రంతా ధ్యానావాసంలో వుంచారు. బుధవారం ఉదయం ఊరేగించి మేళతాళాల నడుమ విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. అనంతరం అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్నప్రసాదాన్ని అందజేశారు.

జూన్‌లో జీజీయూలో జాతీయ సదస్సు

రాజానగరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ(జీజీయూ)ఆధ్వర్యంలో జూన్ 28, 29 తేదీల్లో పరిశోధన, ఆవిష్కరణల వినియోగంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలు, పరిశోధకులు, పారిశ్రామిక నిపుణులు, ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రో చాన్సలర్ కె.విజయభాస్కర్‌రాజు, సలహాదారులు సిశిర్ సాహూ, కె.బిఆర్ వర్మ, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు శ్రీనివాసరావు, టీవీ ప్రసాద్, ప్రిన్సిపాల్స్ వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట డి బ్లాక్‌కు చెందిన 19 ఏళ్ల యువతి నగరంలో నర్సింగ్ చేస్తుంది. మంగళవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, చుట్టు పక్కల వెతికినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో యువతి అక్క విజయకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం దివాన్ చెరువు సమీపంలో బైక్ ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడని బొమ్మూరు పోలీసులు తెలిపారు. మంగళవారం సాయంత్రం సుమారు 70 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి దివాన్‌చెరువు వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం అతడి పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 40.0 (బుధవారం)
కనిష్ఠం : 27.0



పత్తి దుర్గాస్వామి ఈశ్వర శేషారావు

మేమెలా బతికేది.. దేవుడా!

సింహాచలం ఘటనలో ఇద్దరు కోనసీమ వాసుల మృతి

- రెండు కుటుంబాల్లో విషాదం
- కన్నీరుమున్నీరైన కుటుంబీకులు
- మాచవరంలో విషాదఛాయలు
- అండగా జనసేన : పవన్

అంబాజీపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎంత పనిచేశావ్ దేవుడా.. నిన్నుచూద్దామని వస్తే..నీ దగ్గరకే తీసుకుపోయావా..ఎలా బతికేది అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. నాన్నా లేవరా ఇంటికెళ్లిపోదాం.. తమ్ముడూ లేవరా అంటూ ఇద్దరి మృతదేహాలను పట్టుకుని విశాఖ కేజీహెచ్ వద్ద రోదిస్తున్న తీరు చూపరులను కంటతడిపెట్టించింది.. విశాఖ కేజీహెచ్ ప్రాంగణం బంధువుల రోధనలతో నిండిపోయింది. విశాఖ జిల్లా సింహాచలం సింహాద్రి అప్పన్న ఆలయం వద్ద గోడకూలిన దుర్ఘటనలో ఎనిమిది మంది మృతిచెందగా.. ఇద్దరు కోనసీమ జిల్లాకు చెందిన వారు ఉన్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన పత్తి దత్తుడు- వెంకటరమణ దంపతుల రెండో కుమారుడు పత్తి దుర్గాస్వామినాయుడు(28) వైజాగ్‌లో డైమండ్ ఇంటీరియర్స్ వర్క్ చేస్తున్నాడు.అదే గ్రామానికి చెందిన కుంపట్ల శ్రీనివాసరావు-సీతామహాలక్ష్మి దంపతుల ప్రథమ కుమారుడు మణికంఠ ఈశ్వరశేషారావు(శివ)(29) వైజాగ్‌లోని మెట్రో కంపెనీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరిద్దరిదీ ఒకే ఊరు.. స్నేహితులు కావడంతో ఎక్కడకు వెళ్లినా ఇద్దరూ కలిసే వెళతారు. మంగళవారం మధ్యాహ్నం ఇద్దరూ కలిసి అప్పన్న చందనోత్సవానికి వెళ్లారు.సింహాచలం ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండ డంతో ప్రమాదవశాత్తూ ప్రహరీ కూలిన ఘటనలో ఈ ఇద్దరూ మృతిచెందారు. ఈ వార్త టీవీలోను, సామాజిక మధ్యమాల్లోను రావడంతో కుటుంబీకులు చూసి షాక్‌కు గురయ్యారు.చేతికంది వచ్చిన కొడుకుల మృతివార్త తెలుసుకుని విషాదంలో మునిగిపోయారు. వెంటనే సింహాచలం బయలుదేరి వెళ్లారు. అనుకోని ఘటనతో ఇద్దరు యువకులు మృత్యువాత పడడంతో ఆ రెండు కుటుంబాలు కన్నీటిపర్యంతమయ్యారు.అందివచ్చిన కొడుకులు ఇకలేరని.. తిరిగిరారని తలచుకుంటూ రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. మృతులకు కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. బాధిత కుటుంబీకులను మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు,గణబాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు. ఓదార్చారు.

దైవ భక్తే..దూరం చేసింది..



'నా బిడ్డకు దైవభక్తి ఎక్కువ. తరచూ ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుంటుంటాడు. వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ప్రతివారం వచ్చేవాడు.. అంబాజీపేట వచ్చి అందరినీ పలికరించి వెళ్లేవాడు.. ఇప్పుడు ఆ భక్తే అతడిని మా నుంచి దూరం చేసింది' ఇంటీరియర్ డెకరేషన్‌లో ఎంతో పేరు తెచ్చుకున్నాడు. మా కుటుంబానికి చేదోడు..వాదోడుగా ఉంటున్నాడు అంటూ పత్తి దుర్గా స్వామినాయుడు తండ్రి వీర వెంకట సత్యనారాయణ విలపించారు.

పత్తి వీర వెంకట సత్యనారాయణ (దుర్గాస్వామినాయుడు తండ్రి)

ఎలా వెళ్లిపోయావురా?



మమ్మల్ని విడిచి ఎలా వెళ్లిపోయావు రా తమ్ముడు.నువ్వు ఇక లేడంటే అమ్మ, నాన్న నమ్మడం లేదు..ఏం చేయమంటావు రా అంటూ శేషారావు సోదరుడు లక్ష్మీనారాయణ కన్నీటి పర్యంతమయ్యాడు. కుటుంబమంటే తమ్ముడికి ఎంతో ఇష్టం.ఏడాదికాలంగా వైజాగ్ మెట్రో కంపెనీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆస రాగా ఉంటున్నాడు. నాన్నకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. వాడే మా కుటుంబానికి అండ..

- శేషారావు సోదరుడు లక్ష్మీనారాయణ

జనసైనికుల మృతి బాధాకరం

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

జనసైనికులు పత్తి దుర్గాస్వామినాయుడు, కుంపట్ల మణికంఠ ఈశ్వరశేషారావు మృతి బాధాకరమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని,జనసేన పార్టీ తరఫున ఎంతో అభిమానంగా పనిచేశారన్నారు. మృతుల కుటుంబాలకు జనసేన అండగా నిలుస్తుందన్నారు.



పది పూర్తయ్యింది.. తరువాత ఏం చదివించాలన్నదే తల్లిదండ్రులకు పెద్ద టాస్క్.. దీనిలో భాగంగా బుధవారం ఉదయం నిర్వహించిన పాలిటెక్నిక్ పరీక్షకు వేలాదిగా విద్యార్థులు హాజరయ్యారు.




మంత్రి దుర్గేష్‌కు పీఎంవో కార్యాలయ ఆదేశాల ప్రతులు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

మంత్రి దుర్గేష్‌కు సీఎం అభినందన

నిడదవోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) :వియత్నాంలో జరిగే బుద్ధ భగవానుడి అవశేషాల ప్రదర్శన కార్యక్రమ నిర్వ హణ బాధ్యతను కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజ్జు,రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌లకు అప్పగిస్తూ పీఎంవో కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం సీఎం నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో మంత్రి దుర్గేష్‌ను అభినందించారు. వియత్నాంలో జరిగే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి దేశానికి,రాష్ట్రానికి పేరు తీసుకురావా లంటూ సూచించారని మంత్రి కందుల దుర్గేష్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఈ మేరకు రాజమహేంద్ర వరంలోని మధురపూడి ఎయిర్‌పోర్టు నుంచి బుధ వారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.అక్కడ నుంచి వియత్నాం వెళ్లనున్నారు. గురువారం నుంచి మే 6వ తేదీ వరకు జరిగే బుద్ధ భగవానుడి అవశేష ప్రదర్శన కార్యక్రమ నిర్వహణ చేయనున్నారు. మంత్రి దుర్గేష్ కు మధురపూడి విమానాశ్రయంలో జనసైనికులు ఘనంగా వీడ్కోలు పలికారు.



సీఎం చంద్రబాబు కలలకు రూపం వచ్చింది.. ప్రతి అసెంబ్లీలో ఒక పారిశ్రామికవాడ ఉండాలన్న ఆయన ఆలోచలకు నేడు తొలి బీజం పడనుంది..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల్లో పిఠాపురం,జగ్గంపేట, రామచంద్రపురం, రాజమహేంద్రవరంరూరల్, కాకినాడరూరల్, పెద్దాపురంతొలి విడతగా పారిశ్రామిక పార్కులను తీర్చిదిద్దనున్నారు..ఈ మేరకు గురువారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు.



ఏపీఐఐసీ కార్యాలయం

ఆరు నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు

- ఉమ్మడి జిల్లాలో మరో అడుగు
- తొలి విడతగా ఆరు చోట్ల నిర్మాణం
- భూములకు ఏపీఐఐసీ ఆపసోపాలు
- అరకొరగా ప్రభుత్వ భూములు
- అయినా వీటివైపే మొగ్గు
- నేడు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పరుగులు తీయించడం కోసం ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాలకు భూముల లభ్యత తలనొప్పిగా మారింది. ఒక్కో నియోజకవర్గంలో వందెకరాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రయత్నిస్తుంటే ఎక్కడా ఏపీఐఐసీకి భూములే దొరకడం లేదు. రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపినా ఎక్కడా జాగా కనిపించడం లేదు. దీంతో అరకొరగానే ఉన్న స్థలాల్లో ఏదోలా పరిశ్రమలను ప్రోత్సహించ డానికి నానాతంటాలు పడుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆశించిన స్థాయిలో భూములేని పరిస్థితి. ఉన్నంత వరకు భూములు చేతికి వచ్చిన ఆరు నియోజకవర్గాల్లో తొలి విడత పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు నిర్ణయిం చింది. సీఎం చంద్రబాబు నేడు(గురువారం) వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఐదు నియోజకవర్గాల్లో ప్రభుత్వం ప్లగ్‌అండ్‌ప్లే విధానంలో రూ.9.20 కోట్లతో భవనాలు నిర్మించి చిన్న కంపెనీలకు అద్దెకు ఇవ్వనుంది.

చంద్రన్న ఆదేశంతో కదలిక..

రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగం పూర్తిగా పడకేసింది. అప్పటి అధికార నేతల బెదిరింపులు, భూదాహంతో ఉన్న కంపెనీలు, రావాల్సిన కంపెనీలు రాకుండా పోయాయి. దీంతో యువతకు ఉద్యోగాలు లభించని పరిస్థితి. ఇదిలా ఉండగా ప్రభుత్వం మారాక సీఎం చంద్రబాబు పారిశ్రామిక రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గాల్లో సైతం చిన్నమధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భూముల లభ్యత బట్టి పది ఎకరాల నుంచి వంద ఎకరాల వరకు సిద్ధం చేయాలని ఏపీఐఐసీని ఆదేశించారు. వీటిలో ప్రభుత్వం ప్లాట్లు వేసి కంపెనీలకు కేటాయించడం, మరికొన్నింటిలో ప్రభుత్వమే భవనాలు నిర్మించి కంపెనీలకు ఇవ్వాలని నిర్ణయించారు.

తొలుత ఆరు చోట్లే...

కావాల్సినంత భూముల లభ్యత లేకపోవడం, అరకొర ఉన్న చోట ఇప్పటికీ ఆ భూములను రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీకి అప్పగించకపోవడంతో ఏపీఐఐసీ చేతులెత్తేసింది. దీంతో మే 1న నేడు సీఎం చంద్రబాబు ద్వారా వర్చువల్‌గా వీటికి శంకుస్థాపన చేసే అవకాశం లేకపోవడంతో వాటిని పక్కన పడేసింది. ప్రస్తుతం చేతికి భూములు వచ్చిన పిఠాపురం, జగ్గంపేట, రామచంద్రపురం,పెద్దాపురం, కాకినాడరూరల్,రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గాల్లోనే తొలి విడత కింద పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ నిర్ణయించింది.వీటిలో రూ.9.20కోట్లతో చిన్న, మధ్య తరహా కంపెనీలకు ప్రభుత్వమే కార్యాలయాలు నిర్మించి అద్దెకు కేటాయించనుంది. ప్లగ్ అండ్ ప్లే విధానంలో వీటిని అన్ని సౌకర్యాలతో ప్రభుత్వం నిర్మించి కంపెనీలకు కేటాయిస్తుంది. నేరుగా కంపెనీలు ఇందులో ఏ ఇబ్బంది లేకుండా కార్యకలాపాలు ప్రారంభించవచ్చు.ఈ మేరకు నిధులు విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ఏపీఐఐసీ నివేదిక పంపింది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో భూముల్లేకపోవడంతో ఏపీఐఐసీకి కల్వచర్లలో సొంతంగా ఉన్న 104 ఎకరాల్లో ప్లాట్లను పరిశ్రమలకు కేటాయించేలా త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుంది. ఈ లేఅవుట్‌కు సీఎం చంద్రబాబు నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు.కాకినాడ రూరల్, పెద్దాపురంలోను భూముల్లేవు. ఉన్న కొద్దిపాటి ఏపీఐఐసీ భూముల్లో సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు.వీటికి కూడా సీఎం నేడు శంకుస్థాపన చేయనున్నారు. ఏపీఐఐసీ భూములు మినహాయిస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కేవలం పిఠాపురం, జగ్గంపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోనే సీఎం ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు వర్చువల్ శంకుస్థాపన చేయనున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూముల లభ్యత అసలు లేకపోవడం, ఉన్న అరకొర విస్తీర్ణం ఎప్పటికి రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీకి అప్పగిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

ఆరు నెలలుగా భూజల్లెడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏపీఐఐసీ అధికా రులు గడచిన ఆరునెలలుగా నియోజకవర్గాల్లో భూములను గుర్తించే పనిలో పడ్డారు. రెవెన్యూ అధికారులను సంప్రదించి ప్రభుత్వ భూములు ఇవ్వాలని కోరారు. కానీ ఎక్కడ చూసినా పెద్దగా ప్రభుత్వ భూములు లేని పరిస్థితి.అక్కడక్కడా ఉన్నా ఎకరం,రెండెకరాలకు మించి లేవు. దీంతో ఏంచేయాలో ఏపీఐఐసీకి తోచని పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ ప్రభుత్వ భూముల కబ్జా, కొన్ని చోట్ల పూర్తిగా జగనన్న కాలనీలకు లాగేసుకోవడంతో ఎక్కడా భూములు లేవు. దీంతో ఏం చేయాలో తెలియక ఉన్న అరకొర భూములనే ఇవ్వాలని ఏపీఐఐసీ రెవె న్యూ అధికారులను కోరింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మొత్తం పారిశ్రామిక పార్కులకు 404 ఎకరాలే ఉన్నట్టు తేలింది. దీంతో ఏపీఐఐసీ తలపట్టుకుంటోంది. ఇంత తక్కువ భూమిలో పారిశ్రామికపార్కుల ఏర్పాటు ఎలాగో అర్థంకాక గింజుకుంటోంది. పోనీ ప్రైవేటుగా సేకరించాలంటే వందల కోట్ల లో ఖర్చు కానుంది. దీంతో పారిశ్రామిక పార్కు ల ఏర్పాటు కష్టతరంగా మారిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది.

పరిశ్రమలు ఇక్కడే..

- కాకినాడ జిల్లా పిఠాపురంలో 4.05 ఎక రాలు,కాకినాడరూరల్ వాకలపూడిలో ఏపీఐఐసీకి ఉన్న 2.99 ఎకరాలు, పెద్దాపురంలో 27 ఎకరాలను సిద్ధం చేస్తున్నారు. జగ్గంపేటలో 1.81 ఎకరాలు మాత్రమే గుర్తించారు. గండేపల్లిలో 3.39 ఎకరాలు, ప్రత్తిపాడు మండలం శంఖవరంలో 2.82 ఎకరాలు, తుని హంసవరంలో ఏడెకరాలు ప్రభుత్వ భూములు ఉన్నట్టు అధికా రులు తేల్చారు. కాకినాడ జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు 700 ఎకరాలు కాకపోయినా 400 ఎకరాలైనా ఉంటే చాలని అధికారులు భావిస్తే 49.06 ఎకరాలు గుర్తించారు.
- తూర్పుగోదావరి జిల్లాలో అనపర్తి నియోజకవర్గం రంగంపేటలో 8.90 ఎకరాలు గుర్తించారు.రాజమహేంద్రవరంలో సెంటూ కూడా లేదు.రాజానగరంలోని కోరుకొండలో 12.50 ఎకరాలు , రాజమహేంద్రవరం రూరల్ నిడిగట్లలో 12.50 ఎకరాలు ఉన్నట్టు గుర్తించారు. ఒక్క కొవ్వూరులోని తాళ్లపూడిలో 271 ఎకరాలు ఉన్నాయి. నిడదవోలులో సెంటు కూడా దొరకలేదు. గోపాలపురంలో 13.22 ఎకరాలు గుర్తించారు. తూర్పుగోదావరి జిల్లాలో 318 ఎకరాలు ఉన్నట్టు తేలింది.ఇందులో 80 శాతం భూములు కొవ్వూరులోనే ఉన్నాయి.
- కోనసీమ జిల్లాలో ముమ్మిడివరం, రాజోలు, గన్నవరం నియోజకవర్గాల్లో సెంటూ కూడా దొరకలేదు. రామచంద్రపు రంలోని ద్రాక్షారామలో 3.99 ఎకరాలు,అమ లాపు రంలోని ఉప్పలగు ప్తంలో 6.83 ఎకరాలు, మండపేటలోని కేశ వరంలో 24.84 ఎకరాలు, కొత్తపేటలో 1.16 ఎక రాలు ఉన్నట్టు రెవెన్యూ అధికారులు ఏపీ ఐఐసీకి నివేదిక పంపారు. కోనసీమ జిల్లాలో మొత్తం 36.82ఎకరాలు ఉన్నట్టు తేల్చారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వాసు

4 నుంచి డీఎస్సీ మాక్‌టెస్టులు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఎస్‌జీటీ అభ్యర్థులకు తన సొంత ఖర్చుతో రాజమహేంద్రవరంలో మాక్‌టెస్టులు నిర్వహిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. రాజమహేంద్రవరం గౌతమి గ్రంథాలయంలో బుధవారం విలేకరుల తో మాట్లాడారు.ప్రభుత్వం రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. దీనిలో ఎస్‌జీటీ పోస్టులు 6599 ఉన్నాయన్నారు. డీఎస్సీ అభ్యర్థులకు పరీక్ష ఫీవర్ పోగొట్టడానికి మాక్ పరీక్ష ప్రశ్నాపత్రాలు సిద్ధం చేస్తున్నామన్నారు.మే నెల 4 నుంచి రాజమహేంద్రవరం మోరంపూడిలో అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా స్లాట్‌ల విధానంలో మాక్ టెస్టులు జరుగుతాయన్నారు. స్లాట్‌కు వంద మంది చొప్పున పరీక్షలు రాస్తారని చెప్పారు. ఈ నెల 4న మొదటిస్లాట్, 11న రెండో స్లాట్, 18న మూడో స్లాట్, 25న నాల్గో స్లాట్‌లో ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ మేరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏబీసీటీ.ఇన్ వెబ్ సైట్, క్యూఆర్ కోడ్ విడుదల చేశారు.సింహాచలం ఆలయంలో భక్తుల మృతికి సంతాపం తెలిపారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు,వర్రే శ్రీనివాసరావు,కంటిపూడి శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్‌గా రవి



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం జిల్లా ప్రజారవాణా కార్యాలయం (ఆర్టీసీ) పర్సనల్ ఆఫీసర్‌గా కె.రవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కార్యాలయంలో పనిచేస్తున్న రవి అదే హోదాలో పర్సనల్ ఆఫీసర్‌గా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్సనల్ ఆఫీసర్‌గా ఆయన ఇక్కడి నుంచే విధులు నిర్వర్తించనున్నారు.ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ఉద్యోగులు కలసి అభినందనలు తెలిపారు.

హాస్టళ్లు పరిశీలించిన నాయక్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ బుధవారం జిల్లాలో పర్యటించారు. జిల్లాలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద సాంఘిక, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో చేపడుతున్న పనులు పరిశీలించారు. రాజమహేంద్రవరం సిటీలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని, ప్రి మెట్రిక్ బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజన వసతి, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్వయంకృషి కోచింగ్ సెంటర్‌ను సందర్శించి అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన నాయక్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ చిన్నరాముడు, ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను ఆర్అండ్‌బి అతిథిగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి ఎంఎస్ శోభారాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి కేఎస్ జ్యోతి, బీసీ సంక్షేమ అధికారిణి బి.శశాంక తదితరులు ఉన్నారు.



రాష్ట్ర సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, చిన్నరాముడు

ప్రధాని సభకు 360 బస్సులు

ఆర్టీసీ 110.. స్కూల్ బస్‌లు 250

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో మే 2వ తేదీన ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగ సభ కోసం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులు బస్సుల కేటాయింపునకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆర్టీసీ అధికారులు జిల్లా నుంచి 110 బస్సులు, రవాణాశాఖ అధికారులు 250 స్కూల్ బస్సులను తరలిస్తున్నారు. ఇవన్నీ గురువారం రాత్రికే నిర్దేశిత జిల్లాలకు చేరుకోనున్నాయి. జిల్లా నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులను గుంటూరు జిల్లా ఆర్టీసీ ఆర్ఎంకు, స్కూల్ బస్సులను ఎన్టీఆర్ కృష్ణా జిల్లా రవాణాశాఖ అధికారులకు హేండోవర్ చేస్తారు.మే 2వ తేదీ ఉదయం నిర్దేశిత ప్రాంతాలకు ఆయా బస్సులు పంపించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

వర్రీ..ఖుడు!

అన్నదాతల ఆశలపై నీళ్లు



వరి రైతు ఇక్కట్లు.. నేల రాలిన మామిడికాయలు

గోపాలపురం/తాళ్లపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అకాల వాన ముంచేస్తోంది.. అన్నదాతలను పరుగులు పెట్టిస్తోంది.జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి కురిసిన వానతో అన్నదాతలు ఉరుకులు పరుగులు పెట్టారు.రాజమహేంద్రవరం, తాళ్లపూడి, గోపాలపురం తదితర మండలాల్లో వరుణుడు రైతుల ఆశలపై నీళ్ల చల్లాడు.మంగళవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉండడంతో రైతులు కళ్లాల్లో ధాన్యాన్ని వదిలేశారు. అయితే రాత్రి ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి చినుకులు పడ్డాయి. తాళ్లపూడి మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి వర్షం కురిసింది. గజ్జరం అన్నదేవరపేట గ్రామాల మధ్య రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం తడిచి ముద్దయ్యింది. రైతులు వర్షం నీరు పోవడానికి రోడ్డు వారగా గాడులు తీసి నీటిని తొలగించే ప్రయత్నం చేశారు. రైసు మిల్లర్లు సకాలంలో సంచులు ఇవ్వక పోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తాడిపూడి చెందిన కౌలు రైతు పడాల పోసియ్య, పైడిమెట్ట గ్రామానికి చెందిన బోడ పాటి ప్రసాద్ వాపోయారు. ఏది ఏమైనా అకాల వర్షానికి తడిచిన ధాన్యంతో రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. మరో వైపు ఈదురుగాలులకు మామిడి నేలరాలుతోంది. గోపాలపురం మండలంలో మంగళవారం రాత్రి సుమారు రెండు గంటల పాటు బలమైన ఈదురుగాలులు వీచాయి. దుమ్ము రేగడంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది రంగంలో దిగి విద్యుత్ వైర్లపై పడిన చెట్లను రాత్రికి రాత్రే తొలగించి విద్యుత్ పునరుద్ధరణ చేశారు. ఇదిలా ఉంటే ఆకాశంలో కమ్మిన కారుమబ్బులకు ఇటు వరి, అటు మొక్కజొన్న రైతులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈదురుగాలులు వీచినా వర్షం కురవకపోవడంతో మొక్కజొన్న , ధాన్యం రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ఈదురుగాలులకు మామిడి రైతులు బలైపోయారు.

అధ్యాపకులకు నైపుణ్య కార్యక్రమం

కొవ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అధ్యాపకులకు బోధించే సబ్జెక్టుపై నైపుణ్యం పెంపొందించేందుకు అధ్యాపక నైపుణ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏబీఎన్, వీఆర్ ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామ్మోహన్ తెలిపారు. కొవ్వూరు అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం రసాయనశాస్త్రం, లైఫ్ సైన్సెస్ విభాగాల ఆధ్వర్యంలో అధ్యాపకులకు బయో ఇన్ఫర్మేటిక్స్, ఫార్మకోజెనోమిక్స్ అనువర్తనములు అనే అంశంపై ఓమిక్స్ నెక్ట్ జెన్ లాబరేటరీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. పి.మధుబాబు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామ్మోహన్ మాట్లాడుతూ ఫార్మకోజెనోమిక్స్ అనేది ఒక వైద్య రంగం. ఇది వ్యక్తి జన్యు నిర్మాణం, వారి శరీరంలో మందులను ఎలా ప్రభావితం చేస్తుందో పరిశోధిస్తుంది. ఇది నిర్దిష్ట జన్యువులలో మార్పులకోసం చేసే జన్యు పరీక్షను కలిగి ఉంటుంది. ఫార్మకోజెనోమిక్స్ వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగం. దీనిపై రసాయన, సాంకేతిక, జీవ రసాయన, మైక్రో బయాలజీ విద్యార్థులే కాకుండా అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతో కళాశాల చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ ఆదేశాల మేరకు అధ్యాపక నైపుణ్య కార్యక్రమం చేపట్టామన్నారు. అదేవిధంగా ఓమిక్స్ నెక్ట్ జెన్ లాబరేటరీస్ కళాశాలతో ఒప్పందం చేసుకున్నామన్నారు. సదస్సులో పాల్గొన్న అధ్యాపకులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం మధుబాబును కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్, అధ్యాపకులు సత్కరించారు. రసాయన, లైఫ్‌సైన్స్ అధ్యాపకులు డా. వై.రమేష్, డా. సీహెచ్ చలపతిరావు, సీహెచ్ దయాకర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.సురేష్ బాబు, డి.మాధురిదేవి, ఎ.మల్లిక, రత్నదీపిక, కె.రామకృష్ణ, ప్రవీణ్, ఎ.రాణి పాల్గొన్నారు.



డాక్టర్ మధుబాబును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామ్మోహన్

స్త్రీనిధి రుణాల పంపిణీలో బిక్కవోలు ముందంజ

బిక్కవోలు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వయం సహాయక గ్రూపులకు స్త్రీనిధి రుణాల పంపిణీలో బిక్కవోలు మండలం ముందంజలో నిలిచిందని ఏపీఎం టి.సుప్రియ బుధవారం తెలిపారు. 2024-25లో మండలంలోని 256 గ్రూపులకు రూ.7.50కోట్లు రుణాలివ్వాలని లక్ష్యం కాగా తాము 298గ్రూపులకు రూ.8.50కోట్లు అంద జేశామన్నారు. డీఆర్‌డీఏ పీడీమూర్తి, ఏజీఎం ధర్మేంద్ర తనకు మెమెంటో అందజేశారన్నారు.



నందమూరు జంక్షన్‌లో పంటకాలువ పూడికను అడ్డుకున్న రైతులు, అడ్డుకట్ట వేసిన మెటల్‌ను తొలగిస్తున్న దృశ్యం

పంటబోదె పూడ్చివేతపై గ్రామస్థుల ఆందోళన

కొవ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పంటకాలువను రైతు అక్రమించుకుని పూడ్చివేయడాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. మండలంలోని నందమూరు జంక్షన్‌లో బస్టాండ్‌ను ఆనుకుని ఉన్న పంటపొలం యజమాని వట్టికూటి వెంకటేశ్వరరావు తన పొలాన్ని ఆనుకుని ఉన్న కాలువను అక్రమించుకుని మెటల్‌తో పూడ్చివేయడాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. పంచాయతీ కార్యదర్శి అవినాష్, వీఆర్వో ఎం.పోసిబాబు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ బి. రాజులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల ఫిర్యాదుతో సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు కాలువ పూడికను అడ్డుకున్నారు. కాలువలో వేసిన మెటల్‌ను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. మాజీ సర్పంచ్ కె.

● కాలువలో వేసిన మెటల్ తొలగింపు

శ్రీనివాసరావు మాట్లాడుతూ నందమూరు నుంచి పశివేదల వెళ్లే రోడ్డులో వంద సంవత్సరాలుగా ఉన్న పంటబోదెను దౌర్జన్యంగా ఆక్రమించుకుని మెటల్‌తో పూడ్చివేస్తున్నారు. ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌లు స్పందించి పంట బోదె ఆక్రమణలను తొలగించి రైతులు, నందమూరు గ్రామస్థులకు న్యాయం చేయాలన్నారు. దీనిపై వీఆర్వో పోసిబాబు, పంచాయతీ కార్యదర్శి అవి నాష్‌లు మాట్లాడుతూ పంటబోదె పూడికకు సంబంధించి రైతు వెంకటేశ్వరరావుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. ఏప్రిల్ 29న మండల సర్వేయర్ పంట భూమిని సర్వేచేసి డాక్యుమెంటు ప్రకారం సరిహద్దులు నిర్ణయిస్తామ న్నారు. సర్వేయర్ చూపిన కొలతలను రైతు అంగీకరించలేదన్నారు. దీనిపై తహసీల్దార్ దుర్గాప్రసాద్‌కు విషయాన్ని తెలియజేశామన్నారు. బుధవారం రైతు వెంకటేశ్వరరావు ఎక్స్‌కవేటర్ తీసుకువచ్చి మెటల్‌తో పంటబోదెను ఆక్రమించుకుని పూడ్చివేస్తున్నాడని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి చేరుకుని బోదె పూడికను అడ్డుకుని పంటబోదెను యథా విధిగా ఉంచామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కంటిపూడి గోపిచంద్, నందిగం సుధాకర్, మద్దుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంపు

కొవ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవంతీ ఫౌండేషన్ సహకారంతో అల్లూరి వెంకటేశ్వరరావు మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో మే 4నుంచి 31వ తేదీ వరకు ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పొట్రు మురళీకృష్ణ తెలిపారు. వేసవిలో 6 నుంచి 15 సంవత్సరాల బాలబాలికలకు అనుభవం కలిగిన కోచ్‌లు కెనడీ, కె. సతీష్‌ల ఆధ్వర్యంలో ఉచితంగా షటిల్ బ్యాడ్మింటన్ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ సమయంలో పిల్లలకు ఉచితంగా అల్పాహారం అందజేస్తామని తెలిపారు. ఆశక్తికలిగిన వారు 9494338707, 9701999556 లో సంప్రదించాలన్నారు.

గోదావరినదిలో దూకి వ్యక్తి గల్లంతు



వంతెనపై వదిలిపెట్టిన దుస్తులు

కొవ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రోడ్డుకం రైలు వంతెన పైనుంచి గోదావరిలోకి దూకి వ్యక్తి గల్లంతయ్యాడు. బుధవారం వంతెన 159వ స్థంభంవద్ద చొక్కా, లుంగీ వదిలిపెట్టి వ్యక్తి గోదావరినదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దుస్తులను బట్టి కొవ్వూరు పట్టణానికి చెందిన కోట్ల సత్యనారాయణ(78)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అర్ధరాత్రి వరకు గోదావరి నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయాల్సిన ఉంది.

ఇంట్లో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతిచెందినట్లు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్. సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన బమ్మిడి రాము(32) ఈనెల 29న రాత్రి కరెంటులేని సమయంలో మద్యం తాగి వచ్చి ఇంటిముందు మెట్ల వద్ద పడిపోయాడు. భార్య పోసమ్మ రాముని లోపలికి తీసుకువెళ్లి బెడ్‌రూమ్‌లో పడుకోబెట్టింది. కరెంటు వచ్చేసరికి రాము సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దగా కేకలు వేయడంతో చుట్టు ప్రక్కల వాళ్లు వచ్చి కింద కు దింపి చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య పోసమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ సత్యనారాయణ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

ఒకేవీధిలో రెండు చోరీలు

నిడదవోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని సుబ్బరాజుపేటలో మంగళవారంరాత్రి పొడుగు శ్రీరామ మూర్తి దంపతులు నిద్రిస్తుండగా వారి ఇంటి బీరువాలో ఉన్న 4కాసుల బంగారు గొలుసు, 10 వేల రూపాయల నగదు అదే వీధిలోని మంగం లక్ష్మణరావు ఇంటికి తాళం వేసి ఉండగా తాళాలు పగులగొట్టి బీరువాలోని 16తులాల వెండి పట్టీలు, 19వేల రూపాయల నగదు కొన్ని చీరలు దొంగలు దోచుకుపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పట్టణ ఎస్ఐ జగన్మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు : సీఐ

దేవరపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేరాలు అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని దేవరపల్లి సీఐ బీఎన్ నాయక్ పేర్కొన్నారు. దేవరపల్లిలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు గ్రామస్థులతో నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ బీఎన్. నాయక్ మాట్లాడుతూ పోలీసు అధికారులు, అన్నిశాఖాధికారులతో స మన్వయంగా ఉంటూ నేరాలు అరికట్టడానికి ప్రతీ గ్రామంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద ప్రతీ షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఫ్లెక్సీలు ఎక్కడికక్కడ పెట్టేస్తున్నారని భారీ ఫ్లెక్సీలతో ఈదు రుగాలులు వచ్చినప్పుడు అవి జనాలమీద పడే అవకాశం ఉందని, బస్టాండ్‌లవద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులకు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నం దున వీటి నివారణకు చర్యలు చేపట్టాలని, రోడ్డు ప్రమాదాల నివారణ ఎక్కడికక్కడ సూచనల బోర్డులు ఏర్పాటు చేయడం, పోలీసులు గ్రామాల్లో గస్తీ తిరగటం, అన్ని సెం టర్స్‌లో సీసీ కెమెరాలు పెట్టడం వలన నేరాలు తగ్గించ వచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే.దుర్గారావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాయక్

మేడేను విజయవంతం చేయాలి

● ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి అప్పారావు

కొవ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో 139వ మేడేను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి చీర అప్పారావు అన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే పోస్టరును ఆవిష్కరించారు. చీర అప్పారావు మాట్లాడుతూ కార్మికులంతా హక్కుల సాధనకు ఐక్యతతో పోరాడాలన్నారు. మేడేను పురస్కరించుకుని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. గోదావరి ఇసుక కార్మిక సంఘం నాయకులు దుర్గారావు, ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు శ్రీను, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సాయి, మెకానికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చంద్రరావు, తాపీ వర్కర్స్ సంఘం నాయకులు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



మే డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మికులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

● 26 ఏళ్ల తరువాత ఒకేచోటకు...

నల్లజర్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 1998-99 సంవత్సరంలో నల్లజర్ల హైస్కూల్‌లో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం అల్లాడ రామకృష్ణ కళ్యాణ మండపంలో వీరి అపూర్వ కలయిక జరిగింది. నాడు బోధించిన ఇంగ్లీష్ మాస్టారు రత్నకుమార్, సోషల్ చంద్రరావు, పీఎస్ అప్పారావు, ఎస్ఎస్ దత్తు, లెక్కల మాస్టారు శ్రీరామమూర్తి, పీడీ రాజ్‌కుమార్‌లను పూర్వ విద్యార్థి ఆర్మీలో పని చేసిన తలంశెట్టి మోహన్ శేషకుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు మాటాడుతూ అందరూ ఉన్నత స్థాయిలో ఉండడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నీలం సుబ్బారావు, పాతూరి సురేష్, వరిదే బెనర్జీ నాయుడు, లంక్కాజు సాంబమూర్తి, చెల్లు మోజెస్, తలం శెట్టి మోహన్, గాలింకి పుల్లరావు,గొతం దుర్గారావు, పైడిరాజు, వెంకటేశ్వరావు, మామిడి రాధిక, చించిలి అనంతలక్ష్మి, సునీత పాల్గొన్నారు.



నాడు బోధించిన గురువులతో నేటి పూర్వ విద్యార్థులు

గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహం

కొవ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పట్టణంలోని ఔరంగాబాద్ రెండో ఇసుకర్యాంపువద్ద గోదావరి నదిలో ఒక వ్యక్తి మృతదేహం తేలుతుందని సమాచారం రావడంతో ఇన్‌చార్జి వీఆర్వో కంచర్ల రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నాడు. ఒంటిపై నల్లని ప్యాంటు, నలుపు గీతల చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహం పూరిగా పాడైపోయింది. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీఆర్వో రామారావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9440796622, 9154875583కు సమాచారం తెలపాలన్నారు.

మానసిక ఎదుగుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ మోహనభారతి

తాళ్లపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కిషోర బాలికల మానసిక ఎదుగుదలకు విద్యాలయాల్లో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పలువురు వక్తలు కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో కిషోర వికాశంపై శిక్షణా కార్యక్రమాన్ని మండలస్థాయి కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయి కమిటీల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో కిషోర బాలికలతో వారానికి రెండుసార్లు సమావేశం నిర్వహించాలని సూచించారు. కిషోర బాలికల ప్రవర్తనపై పాటించాల్సిన విధానాల గురించి తెలుపుతూ వారు సెల్‌ఫోన్‌కు, సోషల్ మీడియాకి దూరంగా ఉండేలా చర్యలు తీసుకోడంతో పాటు ఆర్థిక పరిపుష్టి కోసం నిర్వహించే శిక్షణా కార్యక్రమాలలో భాగం చేసేలా కృషిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మెహన భారతి, ఎంఈవోలు బాలామణి, నెహ్రాజీ, ఏపీఎం మంగాయమ్మ, అంగన్‌వాడీ సూపర్ వైజరు భానుమతి, భాగ్య కుమారి, తదితర అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



పోతవరంలో భార్గవ్ తేజ కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు

నల్లజర్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి)నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మాన్యం భార్గవ్ తేజ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.8లక్షల70వేల 363ల చెక్కును బుధవారం రాత్రి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అందించారు. టీడీపీ కార్యకర్తలు నాయకులకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి టీడీపీ కార్యకర్త నాయకుల కుటుంబాలకు అదిష్టానం ఎప్పుడు భరోసాగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి రతీష్, రాష్ట్ర కార్యదర్శి హజ్ బోర్డు డైరెక్టర్ షేక్ మీరా సాహెబ్, కూచిపూడి ఉదయభాస్కర్, అబ్బూరి నరేష్, గన్నమనేని వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

కొవ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పశివేదలలో ఎన్డీఏ కూటమి నాయకులు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.5,77,000ల చెక్కులను పంపిణీ చేశారు. కరుటూరి బుల్లి పాపాయమ్మకు రూ.4,05,000 లు, వేములపల్లి లక్ష్మికి రూ. 1,51,000లు, కొడమంచిలి సునీతకు రూ.21,000లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గారపాటి రామచంద్రరావు, శ్రీనివాసరావు, బేతిన నారాయణ, తుంపల్లి ఆదినారాయణ, ఉండవల్లి రాజగోపాల్, ఆలపాటి సాయికృష్ణ, కరిమజ్జి బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

తాళ్లపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో 6 సంవత్సరాలలోపు పిల్లల కోసం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో టీబీ వెంకటరమణ తెలిపారు. మే 5 నుంచి 8వ తేదీ వరకూ పోచవరం అంగన్‌వాడీ కేంద్రంలో, మే 12 నుంచి 15వ తేదీ వరకు గజ్జరం అంగన్‌వాడీ కేంద్రంలో ఆధార్ నమోదు జరుగుతుందని ప్రజలు ఈ కేంద్రాలను వినియోగించుకుని తమ చిన్నారులకు నూతన ఆధార్ నమోదు చేయించుకోవాలని తెలిపారు.

ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్‌గా రవి బాధ్యతల స్వీకారం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రజారవాణా కార్యాలయం (ఆర్టీసీ) పర్సనల్ ఆఫీసర్‌గా కె.రవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కార్యాలయంలో పని చేస్తున్న రవి అదే హోదాలో పర్సనల్ ఆఫీసర్‌గా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పర్సనల్ ఆఫీసర్‌గా ఆయన ఇక్కడి నుంచే విధులు నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ఉద్యోగులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

మోటారుసైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నిడదవోలులో యువకుడి మృతితో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

నిడదవోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలో ఆదివారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ఇందిరానగర్‌కు చెందిన పి.అఖిల్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో ఆ యువకుడిని చికిత్స నిమిత్తం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి రాజమండ్రి తరలించారు. తీవ్ర గాయాలపాలైన అఖిల్ వైద్య ఖర్చులు మేము పెట్టుకుంటామని ఢీకొట్టిన మరో యువకుడు వి.నరసింహమూర్తి బంధువులు పేర్కొన్నారని బాధితుడు అఖిల్‌కు మరింత సీరియస్ ఉండడంతో కాకినాడ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అఖిల్ మంగళవారం మృతి చెందాడు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో వైద్య ఖర్చులు చెల్లించకుండా నరసింహమూర్తి బంధువులు వెళ్లిపోయారు. దీంతో బుధవారం మృతదేహంతో నరసింహ మూర్తి ఇంటి వద్ద ధర్నాకు దిగేందుకు మృతుడి బంధువుల ప్రయత్నించారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న పెన్షనర్స్ సంఘం ప్రతినిధులు

నిడదవోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని ఎంతో పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బలగం అప్పారావు, కీర్తి ఆంజనేయులు అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ భవనంలో కార్మిక దినోత్సవం పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోని ఏ దేశ అభివృద్ధి అయినా ఆ దేశంలోని కార్మిక శక్తిపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పురపా లక సంఘంలోని పారిశుధ్య కార్మికులైన బంగారు శివ గంగ, మామిడిపల్లి కృష్ణవేణి, గుడుపు అప్పారావు, బంగారు సింహాద్రిలను సత్కరించారు. కార్యక్రమంలో కెఎస్‌వీ కుమార్, సామ్రాజ్యం, పొన్నా సుబ్రహ్మణ్యశర్మ, బొజ్జా పాపారావు, గంగుమళ్ళ హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన దిగుబడులు

పెరవలి, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం తో నాణ్యమైన ఆరోగ్యకరమైన దిగుబడులు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ అధికారి స్వాతిముత్యాలు పేర్కొన్నారు. తీపర్రు సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 రకాల పచ్చిరొట్ట విత్తనాలను భూమిపై వెదజల్లడం ద్వారా భూసారం పెరుగుతుందని తద్వారా వేసే పంటలకు అన్నిరకాల పోషకాలు లభిస్తాయన్నారు. దీనివల్ల తక్కువ పెట్టుబడితోపాటు ఎటువంటి పురుగుమందుల ఎరువుల అవశేషాలులేకుండా కూరగాయలు, ధాన్యంపంటలు ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు నందమూరి నారాయణరావు, కరుటూరి గోపాలరావు లను సమావేశంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సత్యనారాయణ, మనోరంజని, నల్ల కాశీ, గ్రామ ప్రముఖులు సత్యనారాయణ, కరుటూరి జనార్దనరావు, కరుటూరి గోపాలకృష్ణ, దుర్గాప్రసాద్, కంటిపూడి గోపాల కృష్ణ పాల్గొన్నారు.



రైతులను సన్మానిస్తున్న దృశ్యం

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

దేవరపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని యర్నగూడెం బరోడా బ్యాంకు మేనేజర్ గుడివాడ సురేంద్రకుమార్ పేర్కొన్నారు. మండలంలోని యర్నగూడెంశాఖ గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాల్లోని విజ్ఞానానికి సంబంధించి పుస్తకాలు పఠనం చేయాలన్నారు. బ్యాంకు తరపున విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అనిత, గ్రామస్థులు మరపట్ల మురళి, పుట్టా పోసిబాబు, అయ్యన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ సురేంద్రకుమార్